పారిశ్రామిక అనుమతులకు వేగంపెంచాలి

-జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్

సంగారెడ్డి మున్సిపాలిటీ, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:
జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ, టిజిఐపాస్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. కలెక్టరేట్ మినీసమావేశ మందిరంలో బుధవారం కలెక్టర్ అధ్యక్షతన టిజిఐపాస్ సమీక్షాసమావేశం నిర్వహించారు. సమావేశంలో పెండింగ్ దరఖాస్తుల స్థితిగతులపై సమగ్రంగా చర్చించారు. ప్రత్యేకంగా పరిశ్రమలకు సంబంధించిన కోల్, ఇథనాల్ ముడిపదార్థాల కేటాయింపుపై సమీక్షనిర్వహించి, ఒక కోల్ అప్లికేషన్‌కు అనుమతి మంజూరుచేయడం జరిగింది. అలాగే ఎస్సీ/ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకంగా టి-ప్రైడ్ కింద 5శాతం సబ్సిడీ దరఖాస్తులకు ఆమోదంతెలిపినట్లు అధికారులు తెలిపారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించి, పరిశ్రమలస్థాపనకు ఎటువంటి ఆటంకాలులేకుండా చర్యలుతీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మాధురి, పరిశ్రమలశాఖ జిఎం తుల్జానాయక్, సంబంధితశాఖల అధికారులు పాల్గొన్నారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త

రైతుల పక్షాన న్యాయపోరాటం దిశగా: హరీశ్‌రావు

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:
రుణమాఫీ చేస్తామని దేవుళ్ల మీద ఒట్లుపెట్టి మరీ మాటతప్పి రైతులనోట్లో మట్టికొట్టిన రేవంత్‌రెడ్డి సర్కార్‌పై మాజీమంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ మేరకు రుణమాఫీ కాక రైతులు పడుతున్న కష్టాలు, కన్నీళ్లను చూసి చలించిపోయి న్యాయపోరాటానికి సిద్ధమయ్యారు. అన్యాయానికి గురైన రైతులకోసం హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలుచేశారు. రుణమాఫీ కోసం 22, 849 మంది రైతులు ఎదురు చూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని ఆశపడితే ఇంతవరకు నిధులు విడుదల చేయకుండా రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలోని రైతుల కష్టాలను పరిగణనలోకి తీసుకొని రాజ్యాంగంలోని ఆర్టికల్ 226 కింద హైకోర్టును ఆశ్రయించానని హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమేస్పందించి అర్హులైన రైతుల ఖాతాల్లో రుణమాఫీ నిధులను జమచేయాలని, హైకోర్టు ద్వారా రైతులకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఉందని విశ్వాసం వ్యక్తంచేశారు.

ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

-ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

పిల్లుట్లలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

శివంపేట, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:
రైతుల ధాన్యాన్ని వెంటవెంటనే కొనుగోళ్లు చేయాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం శివంపేట మండలంలోని రత్నాపూర్, పిల్లుట్ల గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులను దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొను గోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులకు కలగకుండా వసతులు కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండ లాధ్యక్షులు రమణాగౌడ్, మాజీ ఎంపిపి కల్లూరి హరికృష్ణ, పిల్లుట్ల సర్పంచి బుర్ర మురళీగౌడ్, సీనియర్ నాయకులు నాయిని వేణుగోపాల్‌రెడ్డి, చింతస్వామి, వేమారెడ్డి, రాంచందర్‌గౌడ్, పం చమి రేణుకుమార్, మాజీ సర్పంచులు, నాయ కులు తదితరులు పాల్గొన్నారు.

కో ఆప్షన్ సభ్యుల ఎన్నికకు 36 నామినేషన్లు దాఖలు

నర్సాపూర్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:
నర్సాపూర్ మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యుల ఎన్నికల కోసం బుధవారం చివరి రోజు సాయంత్రం 5 వరకు 36 నామినేషన్ పత్రాలు దాఖలు అయినట్లు ఇన్చార్జి మున్సిపల్ కమిషనర్ తిరుపతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 36 నామినేషన్లు రాగా ఇందులో మైనార్టీ వర్గానికి చెందినవారి నుంచి 17 దరఖాస్తులు, మహిళల నుంచి 7, పురుషుల నుంచి 10, ప్రత్యేక పరిజ్ఞానం, అనుభవం కలిగి ఉన్న అభ్యర్థుల కోసం 19 దరఖాస్తులు రాగా అందులో మహిళలు 8, పురుషులు 11మంది దరఖాస్తు చేసుకున్నారని ఆయన తెలిపారు.

జిపిఓల నిర్లక్ష్యం - ప్రజలకు తప్పని ఇబ్బందులు

మొగుడంపల్లి, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:
గ్రామాల్లో రెవిన్యూ సమస్యలు పరిష్కరించాల్సిన జిపిఓలు తమ విధులను ఇష్టానుసారంగా నిర్వహిస్తుండటంతో ప్రజలకు పాట్లు తప్పడంలేదు. మండలంలోని రెవిన్యూ క్లస్టర్లకు నియమించి జిపిఓలు గ్రామాల్లో ఉండకుండా తహసీల్దార్ కార్యాలయానికి పరిమితం అవుతున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. కులం, ఆదాయ, నివాసం లాంటి ధృవీకరణ పత్రాల కోసం ప్రజలు ప్రతి నిత్యం కార్యాలయాల చుట్టూ తిరిగాడాల్సిన దుస్థితి దాపురించిందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి భూసమస్యలు సైతం పరిష్కారం కాక రైతులు పడుతున్న పాట్లు చెప్పనలవిగాకుండా ఉన్నాయి. సంబంధిత జిల్లాస్థాయి అధికారులు స్పందించి జిపిఓలు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను సత్వరమే పరిష్కరించేలా సూచించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వ్యవసాయ క్షేత్రం ఆధారాలు సేకరించిన క్లూస్ టీం

వ్యవసాయ క్షేత్రంలో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం సభ్యులు

పుల్‌కల్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:
శివంపేట గ్రామ శివారులోని రాష్ట్ర ఎన్నికల సంఘం మాజీ కమిషనర్ వి.నాగిరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో జరిగిన దోపిడిని క్లూస్ టీం బుధవారం ఆధారాలను సేకరించింది. వ్యవసాయ క్షేత్రంలో సోమవారం రాత్రి చోరీ జరిగిన విషయం పాఠకులకు విదితమే. పుల్‌కల్ ఎస్ఐ నల్లా విశ్వజన్ బుధవారం సంఘటన స్థలానికి చేరుకుని సంగారెడ్డినుంచి క్లూస్ టీంను రప్పించి ఆధారాలను సేకరించారు. వ్యవసాయ క్షేత్రంలో నిర్మించిన గెస్ట్‌హౌస్ గ్రౌండ్‌ఫ్లోర్ నుంచి రెండవ అంతస్తు పైభాగంలోని పెంట్‌హౌస్‌వరకు ఉన్న తలుపుల తాళాలను ధ్వంస్వం చేసిన ఆధారాలు, ఫింగర్ ప్రింట్‌లు సేకరించారు.

భూకబ్జాకు ప్రయత్నించినవారిపై కేసు నమోదుచేయాలి

-పోలీసు కమిషనరేట్‌లో ఫిర్యాదుచేసిన సామాజిక కార్యకర్త చక్రధర్‌గౌడ్

సిద్దిపేట, ఏప్రిల్ 29, ప్రభాతవార్త ప్రతినిధి:
జిల్లాలోని ఓ ముఖ్య అధికారితో పాటు డివిజన్, మండల స్థాయి రెవెన్యూ అధికారులతో పాటు పొన్నం అనుప్‌కుమార్, పొన్నం పృథ్వీలపై క్రిమినల్ కేసులు నమోదుచేయాలని కోరుతూ సామాజిక కార్యకర్త గాదగోని చక్రధర్‌గౌడ్ సిద్దిపేట పోలీసు కమిషనరేట్‌లో ఫిర్యాదుచేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని మైత్రివనం ఎదురుగా ఉన్న భూవివాదం రోజుకో మలుపు తిరుగుతుందని తెలిపారు. రంగధాంపల్లిపరిధి సర్వేనంబరు 974,975,978,979, 988,1005,1006లోగల 13ఎకరాల భూమికిసంబంధించి దాయాదులమధ్య వివాదం కొనసాగుతుందని తెలిపారు. ఈభూవివాదంలో జిల్లా మంత్రి తలదూర్చి కోట్ల విలువచేసే తమ భూమిని ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నాడని ఓవర్గంవారు ఆరోపించి కోర్టును ఆశ్రయించగా సదరు భూమి విషయంలో అధికారులు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టి వేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. కోర్టుతీర్పు ఆధారంగా భూమి విషయంలో ఓ వర్గానికి మేలుజరిగేలా దురుద్దేశపూర్వకంగా వ్యవహరించిన అధికారులపై శ్రీబాలాజీ రియల్ ఎస్టేట్స్ ప్రతినిధులు పొన్నం అనూప్‌కుమార్, పొన్నం పృథ్వీలపై క్రిమినల్‌కేసులు నమోదుచేయాలని కోరుతూ ఆయన పోలీసు కమిషనరేట్‌లో ఫిర్యాదు చేశారు. దాయాదులమధ్య భూవివాదం నెలకొన్న నేపథ్యంలో అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించి ఓవర్గానికి మేలుచేసేలా వ్యవహరించడం సరికాదన్నారు. అధికార దుర్వినియోగం, తప్పుడు రికార్డులను సృష్టించడం ద్వారా కుట్రపూరితంగా భూకబ్జాకు ప్రయత్నించిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆయన కోరారు.

నాచగిరిలో జయంతి మహోత్సవం

వర్గల్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:
మండల పరిధిలోని నాచగిరి శ్రీ లక్ష్మీనృసింహ్మస్వామి క్షేత్రంలో స్వామివారి జయంతి మహోత్సవంలో భాగంగా బుధవారం సుదర్శన నరసింహ మూల మంత్ర హవనము, పూర్ణాహుతి, స్నపనము, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అలాగే గురువారం చివరిరోజును పురస్కరించుకొని బొడిగె లక్ష్మీనారాయణ భాగవతార్‌చే ఆల్వారాదుల ఉత్స వము, నరసింహ వైభవము హరికథా కాలక్షేపం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి బెల్లంకొండ రంగాచారి, పాలకమండలి చైర్మన్ పి.రవీందర్‌గుప్తా, ధర్మకర్త కొత్తపల్లి శ్రీని వాస్, భక్తులు పాల్గొన్నారు.

నేడు గంగాపూర్‌లో పౌరహక్కుల దినోత్సవం

మర్కుక్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:
మండల పరిధిలోని గంగాపూర్ గ్రామంలో గురువారం పౌరహక్కుల దినోత్సవం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సరిత తెలిపారు. గ్రామ ప్రజలు, వివిధ శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని పిలుపునిచ్చారు.

సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

-పార్టీ కార్యకర్తలకు మంత్రి పొన్నం ప్రభాకర్ సూచనలు

అక్కన్నపేట, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:
కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కాంగ్రెస్ సానుభూతిపరుల ఓట్లు తొలగిస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. ప్రతి బూత్‌కి ఒక బిఎల్ఏను నియమించి సర్ ఓటరు సవరణ ప్రక్రియలో మన ఓట్లు పోకుండా, దొంగ ఓట్లు రాకుండా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని అక్కన్నపేట మండలంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై మాట్లాడారు. ధాన్యం కొనుగోలు గతంలో ఆఫ్‌లైన్‌లో ఉండేదని, ఇప్పుడు ఆన్‌లైన్ చేయడం జరిగిందన్నారు. వ్యక్తిగతంగా ఎలాంటి ఇబ్బంది ఉండదని, ఏమైనా ఉంటే అధికారులు పరిష్కారం చేస్తారన్నారు. గ్రామాల్లో తాగునీటి సరఫరాలో సమస్యలు రావద్దని, ఆయా గ్రామాల్లో శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. జూన్‌లో పాఠశాలలు పునఃప్రారంభం కాగానే బడిబాట కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా అందరూ కృషి చేయాలన్నారు. వర్షాకాలంలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటాలన్నారు. కమిటీలు బాధ్యతగా వ్యవహరించినప్పుడే గ్రామాల్లో సమస్యలు తొలుగుతాయని తెలియజేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో పిసిసి జనరల్ సెక్రటరీ సౌజన్య, ఆత్మా కమిటీ చైర్మన్ జంగపల్లి ఐలయ్య వివిధ గ్రామాల సర్పంచులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్తలతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

వీడియో కాన్ఫరెన్స్‌లో కీలక ఆదేశాలు జారీచేసిన కలెక్టర్

-తాగునీరు, పారిశుద్ధ్య సేవలపై ప్రత్యేకదృష్టి
-ప్రమాదరహిత జిల్లాగా రూపొందించాలి
-జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి మున్సిపాలిటీ, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:
సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ పరిధిలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాలకు సంబంధిత అన్నిశాఖల డివిజనల్‌స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరం నుండి సబ్‌డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడివోలు, మిషన్ భగీరథ, హౌసింగ్, విద్యుత్ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు అంశాలపై సమీక్షించి దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని అన్నిరూట్లలో పరిధి ప్రారంభం, ముగింపు బోర్డులను స్పష్టంగా కనిపించేలా 15 రోజుల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. డివిజన్‌వారీగా తాగునీటి సరఫరా పరిస్థితిపై ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ రఘువీర్‌ను అడిగి తెలుసుకున్న కలెక్టర్, బల్క్ సప్లై, పంపింగ్ సమస్యలు, ఇంట్రా, గ్రిడ్ వివరాలపై సమీక్షించారు. జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా నిరంతర సరఫరా ఉండేలా చర్యలుతీసుకోవాలని, ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే ప్రజలు 1916 టోల్‌ఫ్రీనంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. వేసవి కాలంలో విద్యుత్ అంతరాయంలేకుండా ఫీడర్‌వారీగా పర్యవేక్షణ చేయాలని విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. సాదా బైనామా దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి విచారణ పూర్తిచేసి త్వరితగతిన పరిష్కరించాలని, ఫిజికల్ ఫైల్స్‌ను ప్రాపర్‌గా పంపించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. మున్సిపల్, గ్రామ పంచాయతీల నిధుల వినియోగంపై ఆడిట్ నిర్వహించాలని సూచించారు. ప్రధాన రహదారుల పక్కన చెత్త పేరుకుపోవడం, ప్లాస్టిక్ వ్యర్థాలు కనిపిస్తున్న నేపథ్యంలో పారిశుధ్యంపై ప్రత్యేకదృష్టి సారించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రతి అధికారి వారానికి కనీసం రెండుసార్లు ప్రభుత్వ విద్యాసంస్థలు, వసతి గృహాలను సందర్శించి తనిఖీలు నిర్వహించాలని, పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై డివిజన్‌వారీగా సమీక్షించి, లబ్ధిదారులను త్వరగా నిర్మాణం పూర్తిచేసుకునేలా ప్రోత్సహించాలని ఆదేశించారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో అడిషనల్ కలెక్టర్లు మాధురి, పాండు, సబ్‌కలెక్టర్ ఉమాహారతి, మిషన్ భగీరథ ఎస్ఈ రఘువీర్, హౌసింగ్ పిడి చలపతిరావు, విద్యుత్, రెవెన్యూ డివిజనల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడివోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

రోడ్డుభద్రతపై అధికారులతో సమావేశం...
జిల్లాను ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రోడ్డు భద్రతపై ఆయాశాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్‌తో కలిసి రోడ్డు భద్రత అంశాలపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్, గత సమావేశంలో నేషనల్‌హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియాకు సూచించిన పనులపురోగతిని వివరంగా ఆరాతీశారు. ముఖ్యంగా నేషనల్ హైవే-65పై సరైన నిర్వహణ లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. యు-టర్న్‌ల వద్ద అవసరమైన భద్రతాచర్యలు, సరిపడా లైటింగ్, ఎలిమినేషన్, రేడియం సూచిక బోర్డులు ఏర్పాటుచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జంక్షన్‌లవద్ద తీసుకున్నచర్యలపై వివరాలు తెలుసుకొని, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. చేవెళ్ల ఘటన అనంతరం జిల్లాలో నేషనల్ హైవేపై ఎన్ని వాహనాలను సీజ్‌చేశారనే వివరాల నివేదిక సమర్పించాలని జిల్లా రవాణా అధికారిని ఆదేశించారు. ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ, జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు పోలీసుశాఖ ప్రత్యేక చర్యలు చేపడుతుందని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించేవారిపై కఠినచర్యలు తీసుకుంటున్నామని, ముఖ్యంగా నేషనల్ హైవేలపై స్పీడ్ కంట్రోల్, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగంపై నిరంతర తనిఖీ చేస్తున్నారని తెలిపారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ చైతన్యరెడ్డి, ఆర్ అండ్ బి అధికారులు, పోలీస్, మున్సిపల్, హెల్త్‌శాఖల అధికారులు, నేషనల్ హైవే ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

యువతకు సువర్ణావకాశం...
సంగారెడ్డిలో మెగా జాబ్‌మేళా...
జిల్లాలోని యువతకు ఉపాధి అవకాశాలను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేకదృష్టి సారిస్తున్నదని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. ప్రజాపాలన-ప్రగతిప్రణాళికలో భాగంగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు స్పోర్ట్స్ అండ్ యూత్ సర్వీసెస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాబ్ మేళా పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ బుధవారం కలెక్టరేట్ చాంబర్‌లో ఆవిష్కరించారు. ప్రజాపాలన-ప్రగతిప్రణాళికలో భాగంగా స్పోర్ట్స్ అండ్ యూత్ సర్వీసెస్‌శాఖ ఆధ్వర్యంలో మే 8న సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. అర్హత కలిగిన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు ముందస్తుగా రిజిస్ట్రేషన్ చేసుకుని జాబ్ మేళాలో పాల్గొనాలని ఆయన తెలిపారు. యువతకు ఉపాధి కల్పనలో ఇటువంటి కార్యక్రమాలు కీలకపాత్ర పోషిస్తాయని, ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మాధురి, జిల్లా యువజన సేవల అధికారి అఖిలేష్‌రెడ్డి, డిఐసి జిఎం తుల్జానాయక్ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి రైతుబిడ్డ కాదు రైతుద్రోహి

-ధాన్యం కొనుగోలు చేయకపోతే రహదారులను దిగ్బంధం చేసి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తాం
-మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడుతున్న హరీశ్‌రావు

సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:
సిఎం రేవంత్‌రెడ్డి రైతు బిడ్డ కాదు రైతు ద్రోహి అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు అన్నారు. నారాయణరావుపేట మండల కేంద్రంలోని వరిని బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలోని కొన్ని జిల్లాలో 5 కిలోల వరకు తరుగు తీస్తున్నారని మండిపడ్డారు. నీవు రావు, నీమంత్రులు రారు రైతుల వద్దకు ఎసి గదిలో కూర్చుని మాట్లాడం కాదు, రేవంత్‌రెడ్డికి దమ్ముంటే రైతుల దగ్గరికి వచ్చి మాట్లాడాలని సవాల్ విసిరారు. మొక్కజొన్న, పొద్దుతిరుగుడు కొనుగోలు చేయకపోవడంతో రైతులు ధాన్యం కుప్పల వద్ద రోజుల తరబడి నిద్ర చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని లేదంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ధాన్యం కొనుగోలు చేయకపోతే రహదారులను దిగ్బంధం చేసి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామని హరీశ్ రావు అన్నారు.

పరీక్షలో ఫెయిల్ అవుతానని ప్రాణం తీసుకున్న విద్యార్థిని

-తీరా ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన వైనం

పాపన్నపేట, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:
టెన్త్ ఫెయిల్ అవుతాననే భయంతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న పదోతరగతి విద్యార్థిని పాసయ్యింది. తీరా బుధవారం వచ్చిన ఫలితాలు చూస్తే.. ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యింది. ఇదిచూసిన ఆమె కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. మండలపరిధిలోని పొడిచన్నపల్లి తండాకు చెందిన బానోత్ రమేష్, లత దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక్క కుమారుడు సంతానం. ఉన్న కొద్దిపాటి పొలంలో వ్యవసాయం చేసుకుంటూ బతుకుతున్నారు. 2014లో తండ్రి రమేష్ హత్యకు గురయ్యాడు. అప్పటినుండి తల్లి లత కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తుంది. పెద్దకూతురు నందిని నర్సింగ్ చదువుతుంది. రెండోకూతురు సాయిప్రియ, కొడుకు శంకర్ ఇద్దరూ కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో పదోతరగతి పరీక్షలురాశారు. అప్పటినుండి పరీక్షల్లో ఫెయిల్ అవుతాననే భయంతో సాయిప్రియ ఆందోళన చెందుతుండేది. తల్లి ధైర్యంచెప్పింది. అయినా వీడని భయంతో ఈ నెల 24న ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకొని మరణించింది. ఈరోజు వెలువడిన ఫలితాలు చూస్తే సాయిప్రియ 480 మార్కులతో ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యింది. తమ్ముడు శంకర్ 446 మార్కులతో ఉత్తీర్ణత చెందాడు. అనవసర భయంతో ఎంతపని చేశావు తల్లీ అంటూ ఇంటిల్లిపాదీ కుమిలికుమిలి ఏడుస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

-ట్రాక్టర్ బోల్తాతో ముగ్గురికి గాయాలు
-తీవ్రంగా గాయపడిన యువకుడు ఆసుపత్రిలో కన్నుమూత

రామాయంపేట, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:
రామాయంపేట పట్టణశివారులో జరిగిన రోడ్డుప్రమాదం విషాదాన్ని మిగిల్చింది. బుధవారం ఉదయం మెదక్ రోడ్డు బాలాజీ ఫంక్షన్ హాల్ సమీపంలో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. వీరిలో పట్టణానికి చెందిన కోనాపురం ఎల్లం అనే యువకుడు తీవ్రంగా గాయపడగా, స్థానికులు అతడిని వెంటనే హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతూ ఉండగా, యువకుడు ప్రాణాలు కోల్పోయినట్లు కుటుంబీకులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులు ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సింగూరు ప్రాజెక్టులో దూకి వ్యక్తి ఆత్మహత్య

పుల్‌కల్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:
సింగూరు ప్రాజెక్టులో దూకి ఓవ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పుల్‌కల్ ఎస్ఐ నల్లా విశ్వజన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని నిజాంపేట ప్రాంతానికి చెందిన బండారిపల్లి శ్రీనివాసరావు (61) ఫుట్‌వేర్ దుకాణంలో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ప్రతిరోజు మధ్యాహ్నం ఇంటికి భోజనానికి వచ్చి, వెళ్లేవాడు. అయితే, ఈ నెల 28వ తేదీన 11.30 గంటలకు తన ఫోన్ దుకాణంలోనే పెట్టి బయటకు వెళ్లిపోయాడు. శ్రీనివాసరావు కనిపించడం లేదంటూ కెపిహెచ్‌బి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, మ్యాన్ మిస్సింగ్ కింద కేసు నమోదు చేశారు. కెపిహెచ్‌బి పోలీసులు దర్యాప్తు చేయగా, సింగూరు ప్రాజెక్టు వైపునకు వెళ్లినట్లు గుర్తించారు. బుధవారం ఉదయం 7.30 గంటలకు మృతుడి కుమారుడు బండారిపల్లి సంపత్, స్నేహితులు గరిమెళ్ల శ్రీకాంత్, కడియాల సత్యనారాయణ, కెవివి అప్పారావులు ప్రాజెక్టువద్దకు వచ్చి గాలించారు. ప్రాజెక్టు నిల్వనీటిలో బోర్లపడి ఉన్న మృతదేహాన్ని పరిశీలించగా, బండారిపల్లి శ్రీనివాసరావుగా గుర్తించారు. ఆర్థిక పరిస్థితులు బాగాలేకపోవడం, అప్పులబాధ అధికమవడం వల్ల తీవ్రమనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి కుమారుడు బండారిపల్లి సంపత్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మండలంలో పూర్తయిన శిక్షణ తరగతులు

మొగుడంపల్లి, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:
మండల కేంద్రమైన మొగుడంపల్లిలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్యూమరేటర్లకు మూడు రోజుల పాటు నిర్వహించిన జనాభా గృహ లెక్కింపు శిక్షణ తరగతులు పూర్తయ్యాయి. మే 11వ తారీఖు నుంచి ఇళ్ల లెక్కింపు పనులు చేపట్టనున్నారు. కచ్చితమైన వివరాలను సేకరించి సమయానికి నివేదికలు సమర్పించాలని అధికారులు ఎన్యూమరేటర్లకు వివరించారు.

మే 2 నుంచి 10వ తేదీ వరకు చిక్కడపల్లి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

చిక్కడపల్లి, ఏప్రిల్ 29, ప్రభాతవార్త : హరినామ సంకీర్తన...గోవింద కీర్తనలతో వేకువనే వీధులు మారుమ్రోగుతుంటాయి. గంటానాదం, వేదమంత్రాలు గాలి తరంగాల మాటున చిక్కడపల్లి వీధివీధిని మేలుకొలుపుతాయి. తిరుమల తిరు క్షేత్రానికి సాక్షాత్తు ప్రతిబింభంలా నిలిచిన శ్రీ శ్రీనివాసుని కోవెల చిక్కడపల్లి ప్రాంత ప్రజలతో పాటు భాగ్యనగారినిక కొంగుబంగారమై కొలువుదీరింది. ఇక్కడున్న ఆది విష్ణువాంశ శ్రీనివాసుని పాదాలు తాకినంతనే పాపులు పునీతులై కష్టాలు కడతేరి భక్తులు అష్టఅయిశ్వర్యాలు పొందుతారని ప్రతీతి ఉన్నది. సుమారు 76 ఏళ్ళ క్రితం శ్రీనివాసపురం(చిక్కడపల్లి)లో గుడిదేవుని వంశీకుడైన జంగయ్యగౌడ్ నిర్మించిన ఈ ఆలయం నేటికి అద్భుత శిల్పాకళా సంపదను చూపరులను ఆకర్షిస్తున్నది. గుడిదేవుని జంగయ్య గౌడ్ పాంచరాత్రాగమ శాస్త్రానుసారంగా వేదవిధి పూర్వకంగా నిష్ఠాగరిష్ఠుడైన బ్రాహ్మణోత్తములచేత స్వామివారి శిలామూర్తులను ప్రతిష్ఠింపచేశారు. ఆనాటి నుంచి నేటి వరకు పిలిస్తే పలికే దైవంగా నిలిచిన శ్రీనివాసుని సేవించనివారు శ్రీనివాసపురం పరిసరాల్లో లేరంటే అతిశయోక్తికాదు. వైష్ణవ సాంప్రదాయాన్ని పరిరక్షిస్తున్న ఈ ఆలయం, బ్రాహ్మణోత్తములకు వేదికగా నిలిచింది. జాతకర్మ నుంచి మహాయాగాల వరకు దేన్నైనా అలవోకగా అనుపాతం చేసే బ్రాహ్మణులు ఇక్కడ అందుబాటులో ఉండడం వల్ల నగరానికి చిక్కడపల్లి చిన్న తిరుపతిగా నిలిచింది. వైష్ణవ సాంప్రదాయాలకు అనుగుణంగా వచ్చే ప్రతి పర్వదినాన ఆలయానికి భక్తులు తండోపతండాలుగా రావడం ఇక్కడి విశేషం. స్వామివారి మహత్యానికి ఇది చిరు నిదర్శనం మాత్రమేనని స్థానికులు పేర్కొంటారు. 1981 నుంచి దేవాదాయ ధర్మాదాయ శాఖ పర్యవేక్షణలో ఉన్న ఆలయంలో హిందూ ధర్మశాస్త్రాలకు అనుగుణంగా భక్తులకు ప్రసాద వితరణ జరుగుతోంది. రాష్ట్రంలోని మహోన్నత ఆలయాలలో జరిగే విశిష్ట ఆచార వ్యవహారాలను ఇక్కడ యధాతథంగా వేదపండితుల పర్యవేక్షణలో జరుగుతోంది. జరుగుతుంది.

బ్రహ్మోత్సవ కార్యక్రమాలివీ

మే 2వతేదీ నుంచి 10వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని అలయం వ్యవస్థాపక వంశీయుడు జి.శ్రీనాథ్‌గౌడ్, అసిస్టెంట్ కమీషనర్ , కార్యనిర్వహణాధికారి వి.అంబుజ వివరించారు. 2న సాయంత్రం విష్వక్సేన పూజ, రక్షాబంధనము, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ట, రాత్రి 8 గంటలకు మహానివేదన, మంత్రపుష్పం, 3న ఉదయం పతాధివాసము, హవనము, బ్రహ్మోత్సవాల ప్రారంభ సూచకంగా ధ్వజారోహణము ఉంటుంది. అదేరోజు సాయంత్రం 5 గంటలకు భేరిపూజ, దేవతాహ్వానము, హవనము, బలిహరణము, రాత్రి శేషవాహనసేవ ఉంటుంది. 4న పల్లకీసేవ, రాత్రి హంసవాహనసేవ, 5న ఉదయం పదిన్నరకు పల్లకీసేవ, రాత్రి గజవాహనసేవ,6న పల్లకీసేవ అనంతరం స్వామివారికి ఎదురుకోళ్లు అనంతరం కల్యాణ మహోత్సవం జరుగుతుంది. 7న పల్లకీసేవ, గరుఢవాహన వాహన సేవ, 8న రథప్రతిష్ట, స్వామివారి శృంగార రథోత్సవం, 9న ఉదయం పూర్ణాహుతి, చక్రతీర్థము, ద్వాదశారాధన, శ్రీ పుష్పయాగం, దేవతోద్వాసన ఉంటుంది. 10న ఘటాభిషేక కార్యక్రమాన్ని 81 కలశాలతో జరుగుతుంది. ఈ సందర్భంగా స్వామివారి వెండిపూత ఘటాభిషేక అష్టలక్ష్మి కలశాలను ఇవ్వడం జరుగుతుంది. అదే రోజు రాత్రి స్వామివారి శృంగార డోలోత్సవం అనంతరం వేదపండితులకు సన్మాన కార్యక్రమం ఉంటుంది.

చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వస్వామి అలయ ముఖద్వారము

బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతి రోజు సాయంత్రం అరు గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రతిరోజు లలిత సహస్ర, విష్ణుసహస్రనామ పారాయణాలుంటాయి.

సమాజ దర్పణం పుస్తకావిష్కరణ

ప్రముఖ రచయిత పేరి నాగేశ్వర్ రావు రచించిన సమాజ దర్పణం గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న నాగరాజ శర్మ

చిక్కడపల్లి ఏప్రిల్ 29 , ప్రభాతవార్త : చిక్కడపల్లి త్యాగరాయణ గానసభలో శ్రీ ద్యుతి మ్యూజికల్ అకాడమీ, ఇసాన్ ఫౌండేషన్, విజయ్ క్రియేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ గాయకుడు, సమాజ సేవకుడు లయన్ పేరి నాగేశ్వరరావు రచించిన సమాజ దర్పణం పుస్తకావిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ పూర్వపు సీఎండీ ఎం. నాగరాజ శర్మ గ్రంథాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. అధ్యక్షత వహించిన త్యాగరాయగానసభ అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్ధనమూర్తి మాట్లాడుతూ నాగేశ్వరరావు అతి తక్కువ కాలంలోనే రెండు అద్భుత గ్రంథాలను అందించడం ఆయన ప్రతిభకు నిదర్శనమన్నారు. రిటైర్డ్ ఐజీ ఆకుల నరసింహ, రిటైర్డ్ బ్యాంక్ జనరల్ మేనేజర్ పేరి కామేశ్వరరావు పాల్గొన్నారు. ఎనిమిది గంటల పాటు పెరి నాగేశ్వర్ రావు స్వరసారథ్యంలో ఆ పాట మధురాలుసంగీత విభావరి శ్రోతలను ఉర్రూతలూగించింది. 75 మందికి పైగా గాయనీ గాయకులు అలనాటి మధుర గీతాలను ఆలపించారు. నాగేశ్వరరావు-విజయలక్ష్మి, రవికుమార్-సవితశ్రీ దంపతులతో పాటు ప్రసన్న విజయ్ కుమార్, సౌమ్య, నీరజ, పి.వి. రమణమూర్తి, హరికృష్ణ తదితరుల గానం సభికులను అలరించింది.

అబ్బురపరిచిన చిన్నారుల నృత్యకుసుమాలు

గురు శిష్యులను సన్మానిస్తున్న జానకి తదితర అతిథులు

రవీంద్రభారతి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త : ప్రముఖ సాంస్కృతిక సంస్థ కనకదుర్గా నృత్యవిభావరి ,హైదరాబాద్ ఆధ్వర్యంలో ప్రముఖ యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి జయంతి మహోత్సవాలను పురస్కరించుకుని సంస్థ చిన్నారి కళాకారులు సుప్రసిద్ధ భరతనాట్య గురు నిర్మల ప్రభాకర్ నేతృత్వంలో నృత్యకుసుమలు శీర్షికన ప్రదర్శించిన భరతనాట్యం ఆహుతులను అబ్బురపరిచి అలరించింది. ఈ సందర్భంగా చిన్నారులు సహస్ర, సంహిత, జయనీ, సతాక్షీ, పూర్వీ, కృతిక, వాసవి, రిత్విక తదితరులు అద్భుతంగా ప్రదర్శించిన వినాయకస్తుతి, జతిస్వరం, హరిగిరి నందిని, దుర్గాష్టకం, అన్నమాచార్య, త్యాగరాయస్వామి కీర్తనలు, లింగాష్టకం నృత్యాంశాలు ప్రేక్షకులను తన్మయుల్ని చేసి ఆధ్యాత్మికలోకంలో విహరింపజేశాయి. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక పాఠశాల ప్రిన్సిపాల్, కల్చరల్‌వింగ్ కోఆర్డినేటర్ జానకి గురువు నిర్మలాప్రభాకర్‌ను ఘనంగా సత్కరించి చిన్నారికళాకారులకు శుభాశీస్సులందజేశారు.

జీహెచ్ఎంసి చార్మినార్ జెడ్‌సిగా సత్యనారాయణ బాధ్యతలు

చార్మినార్ జోనల్ కమిషనర్‌గా శ్రీనివాస్‌రెడ్డి నుండి బాధ్యతలు స్వీకరిస్తున్న సత్యనారాయణ

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 29, ప్రభాతవార్త : మహానగరపాలక సంస్థ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్‌గా కె.సత్యనారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. జీహెచ్ఎంసి ప్రధాన కార్యక్రమంలో అదనపు కమిషనర్ (అడ్మిన్/లీగల్)గా బాధ్యతలు నిర్వహిస్తున్న కె.సత్యనారాయణను ప్రస్తుత జెడ్సి శ్రీనివాస్‌రెడ్డి స్థానంలో నియమించారు. దీంతో ఆయన నర్కిపూల్ బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో జెడ్సి శ్రీనివాస్‌రెడ్డి నుండి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నూతన జెడ్సి సత్యనారాయణ మాట్లాడుతూ జోన్‌లోని మలక్‌పేట్, సంతోష్‌నగర్, యాకుత్‌పురా, చార్మినార్, మూసారాంబాగ్ సర్కిళ్ళలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు నూతన జెడ్సిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

సమ్మర్ స్పోర్ట్స్ కోచింగ్ క్యాంప్స్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

కార్యక్రమంలో పాల్గొన్న చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ,

చార్మినార్,ఏప్రిల్ 29 ప్రభాతవార్త : పాతబస్తీ కుడా స్టేడియంలో గురువారం సాయంత్రం చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిహెచ్ఎంసి చార్మినార్ జోన్ స్పోర్ట్స్ సమ్మర్ కోచింగ్ క్యాంప్స్(2026) ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ మాట్లాడుతూ యువత,విద్యార్థులు సమ్మర్ కోచింగ్,క్యాంప్స్‌లను అన్ని విధాల సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిత్యం క్రీడలు ఆడటం వల్ల ఎంతో ఉత్సాహంగా ఉంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ సత్యనారాయణ,స్పోర్ట్స్ ,జిహెచ్ఎంసి అధికారులు పాల్గొన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందిస్తాం

అత్తాపూర్ ఏప్రిల్ 29, ప్రభాతవార్త : వినియోగదారులకు నాణ్యమైన సేవలను అందించేందుకు ఐహెచ్‌సిఎల్ కంపెని గగన్‌పహాడ్ ఎయిర్‌పోర్టు రోడ్డులో జింజర్ హోటల్‌ను ప్రారంభించారు. ఐహెచ్‌సిఎల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ దీపికా రావు , నిమంత్రన్ క్యాటరింగ్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రతాప్ జడేజా మాట్లాడుతూ.. "ఫైనాన్షియల్ సర్వీసెస్, టెక్నాలజీ, మాన్యు ఫ్యాక్చరింగ్, మెడికల్ టూరిజం, విద్య రంగాలతో పాటుగా ఒక సుస్థిరమైన సాంస్కృతిక గమ్య స్థానంగా కూడా వినియోగదారులను కలిగి ఉన్న హైదరాబాద్‌లో విభిన్నమైన డిమాండ్‌ను అందుకోవడానికి వ్యూహాత్మకంగా ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేయబడిందని అన్నారు. సమావేశాలు, సదస్సులు, సామాజిక కార్యక్రమాలకు అనువుగా విశాలమైన బాంకెట్ సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.



చదువుతోపాటు కళల్ని ప్రోత్సహించాలి : సినీ రచయిత శ్రీరామ్ చౌదరి

కళారత్న అవార్డు ప్రదానం చేసిన దృశ్యం

చిక్కడపల్లి ఏప్రిల్ 29 , ప్రభాతవార్త : చదువుతోపాటు కళల్ని ప్రోత్సహించాలని సినీ రచయిత శ్రీరామ్ చౌదరి పేర్కొన్నారు. బుధవారం పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ నృత్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయిలో నృత్య ప్రదర్శనలు, కళారత్న అవార్డు ప్రదానం, సమ్మర్ సంగీతోత్సవం ఘనంగా జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మేడిది సుబ్బయ్య ట్రస్టు ఫౌండర్ డాక్టర్ మేడిది వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సంగీతానికి స్పందించని వారు ఉండరు. సంగీతం అనేది మనుషులు ప్రకటించే గొప్ప అంశం. సంగీతానికిని జాతి, కుల, మత, వర్గ, ప్రాంత, దేశ బేధాలు లేకుండా మనుషుల్ని కలిపే శక్తి ఉంటుందన్నారు. కళారత్న అవార్డు గ్రహీతలు డాక్టర్ పి.నారాయణ మూర్తి (హైదరాబాద్), రంగస్థల స్వర బ్రహ్మ జి.రామకృష్ణ (నెల్లూరు), బి.గిరిజలక్ష్మి (సూళ్లూరుపేట), నాట్య మయూరి అపర్ణ (నెల్లూరు) , పందిటి సుబ్బయ్య (నెల్లూరు), ఎం.వి.ఎన్.ఎస్.దుర్గ (తిరుపతి), సి.హెచ్.రాజా దాసు (డక్కిలి), నాయబ్ రసూల్ (నెల్లూరు), కె.మస్తానయ్య (చౌటపాలెం) తుమ్మల సీతారామయ్య (యల్లంటి) లను శాలువా, మెడల్, మొమెంటో, ప్రశంసాపత్రం, కిరీట దారణతో ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో కర్నాటి ఆంజనేయరెడ్డి, డాక్టర్ కె.బాబు అగస్టస్, డాక్టర్ షేక్ ఇంతియాజ్, లక్ష్మీ నారాయణ, బూదాటి రాధాకృష్ణయ్య, మిరియాల వెంకట రమణయ్య, ఎ.ఎం.రత్నం, యనమల నాగేశ్వరరావు, ఎస్.వి.రమేష్ బాబు, షేక్ రియాజ్ బాషా, షేక్ పర్వీన్, అందే శ్రీనివాసులు, బిట్టు సరస్వతి, బలరామయ్య నాయుడు, మురళీమోహన్ రాజు, చీదరాల చెన్నయ్య, రవి గోగులపల్లి, శ్రీకర్ రెడ్డి, వివిధ జిల్లాల నృత్య కళాకారులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

బతుకమ్మకుంట పేరుతో కోట్ల ప్రజాధనం వృధా

-కాంగ్రెస్‌నేతల కళ్లలో ఆనందం చూసేందుకే హైడ్రా చర్యలు
-బిఆర్ఎస్ అంబర్‌పేట్ ఇంచార్జ్ ఎడ్ల సుధాకర్‌రెడ్డి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎడ్ల సుధాకర్‌రెడ్డి

హైదరాబాద్,ఏప్రిల్ 29,ప్రభాతవార్త: హైడ్రా అవగాహన రహిత్యం, కొంత మంది కాంగ్రెస్ నేతలను సంతృప్తి పరిచేందుకు బతుకమ్మకుంట అభివృద్ధి పేరిట కోట్ల రూపాయాల ప్రజాధనం వృదా చేశారని బిఆర్ఎస్ ఆంబర్‌పేట్ ఇంచార్జ్ ఎడ్ల సుధాకర్‌రెడ్డి మండిపడ్డారు. కోర్టు స్టేటస్ కో కోనసాగుతున్నప్పుడు అధికారుల దూకుడు చర్యలతో బతుకమ్మకుంట అభివృద్ధి కోసం రూ.8 కోట్లు ఖర్చు చేయడం దారుణమన్నారు. బతుకమ్మకుంట అభివృద్ధి ఆనావాళ్లు లేకుండా యాదాస్థితి కోనసాగించాలని సుప్రీం కోర్టు తీర్పు వెల్లడించడం ప్రభుత్వానికి చెంపపెట్టని ఆయన అన్నారు. బుధవారం ఛేనంబరు చౌరస్తాలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుధాకర్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ మాజీ ఎంపీ వి.హనుమంతారావును కళ్లలో ఆనందం చూసేందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బతుకమ్మకుంటపై హైడ్రాను ఉసికొల్పారని ఎద్దేవ చేశారు. విహెచ్ అవగాహన రహిత్యంతో అందరిని తప్పుదోవ పట్టిస్తున్న విషయాన్ని అధికారులు పసిగట్టకుండా తొందరపడటంతో వారికి కోర్టు నుంచి మొట్టికాయలు పడాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. బతుకమ్మకుంటపై చేసిన వృదా ఖర్చును కాగ్ సంస్థ ఎత్తి చూపి బాధులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ తప్పుడు చర్యలు బీజేపీ సైతం మద్దతూ తెలిపి వారు చేసిన ధర్నాలో పాలుపంచుకోవడం హాస్యాస్పదమన్నారు. అలాగే బతుకమ్మకుంటలో సిపిఎం నేత చేసిన అక్రమలను పట్టించుకోకుండా వారిని ధర్నాలో భాగస్వాములు చేయడం దివాలకోరుతానానికి నిదర్శనమన్నారు. బతుకమ్మకుంటపై అంతాత్తైన ఆర్బాట ప్రచారం చేసిన వారు ఇప్పుడు కోర్టు తీర్పుతో ప్రజలకు ఏం సమాధానం చెపుతారని ఆయన ప్రశ్నించారు. బిఆర్ఎస్ పార్టీ పుట్టక ముందు తాను బతుకమ్మకుంట స్థలాన్ని తీసుకున్నాని, పార్టీకి సొంత వ్యాపారానికి ఏలాంటి సబంధం లేదన్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఇప్పటికైన అవగాహన రహిత్యంతో వ్యవహారించవద్దని ఆయన హితవు పలికారు. బతుకమ్మకుంటపై చేసిన ప్రజాధనాన్ని బాధ్యుల నుంచి రికవరి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

పది ఫలితాలలో సత్తా చాటిన నార్సింగి గురుకుల విద్యార్థినులు

- గండిపేట మండల టాపర్‌గా నిలిచిన శ్రీలేఖ
- 100.శాతం ఫలితాలు సాధించిన గురుకుల, కేజీబివి పాఠశాల విద్యార్థులు

నార్సింగి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త : పదో తరగతి ఫలితాలలో నార్సింగిలోని గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. ఈ పాఠశాలకు చెందిన 7.గురు విద్యార్థులు 600.కు గాను 550.కి పైగా మార్కులు సాధించి ఔరా అనిపించుకున్నారు. 500-550 మధ్యలో 33, 450-500లోపు 27, 400-450లోపు 09, 350-400.లోపు 03.విద్యార్థులు ఉత్తీర్ణతను పొందారు. ఇందులో ఎస్.శ్రీలేఖ 579, వైష్ణవి 569, మౌనిక 568, హర్షిణి 565.మార్కులు సాధించి పాఠశాల అధ్యాపకగణంతో శభాష్ అనిపించుకున్నారు. భవిష్యత్తులో మరింత పట్టుదలతో చదివి జీవితంలో ఉన్నత స్థానంకు చేరుకోవాలని అధ్యాపకులు ఆశీర్వదించారు. గండిపేట మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కలిపి మొత్తం 739.మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా 568.మంది ఉత్తీర్ణత సాధించారు. 161.మంది ఫేయిల్ అయ్యారు. నార్సింగి గురుకుల పాఠశాల విద్యార్థులు 100.శాతం ఫలితాలు సాధించారు. నార్సింగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 72.శాతం, వట్టినాగులపల్లిలో 75.శాతం, మణికొండలో 79.శాతం, హైదర్షాకోట్‌లో 64.శాతం, కిస్మత్‌పూర్ కేజీబివిలో 100, కోకాపేట్‌లో 80.శాతం ఫలితాలు వచ్చాయి. 579.మార్కులు సాధించిన శ్రీలేఖ గండిపేట మండల టాపర్‌గా నిలిచింది. 547.మార్కులతో స్నేహ ద్వితీయ స్థానంలో నిలిచింది. టాపర్లను పాఠశాల అధ్యాపకులు అభినందించారు.

హైదర్షాకోట్‌లోని ఎస్ఎంపి ఇంటర్‌నేషనల్ స్కూల్‌లో 100.శాతం ఉత్తీర్ణత సాధించారు. 50.మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 50.మంది పాస్ అయ్యారు. ఇందులో దివ్యాక్షి ప్రథమ స్థానంలో, పార్థసారథి రెండో స్థానంలో నేహారెడ్డి మూడో స్థానంలో నిలిచారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన టాపర్లను, ఉత్తీర్ణత పొందిన విద్యార్థులందరిని పాఠశాల చైర్మన్ పట్లోళ్ల ప్రభాకర్‌రెడ్డి అభివనందించి, ఆశీర్వదించారు.

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సమస్యల పరిష్కారానికి చర్యలు

- సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజన

జీడిమెట్ల సర్కిల్ గణేష్‌నగర్ డివిజన్‌లో పర్యటించి స్థానిక సమస్యలను అడిగితెలుసుకుంటున్న సైబరాబాద్ మున్సివల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీజన, బిజెపి నాయకులు ఒక్కంటి దయాకర్ తదితరులు

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త: ప్రజాసమస్యల పరిష్కారానికి ఫిర్యాదుల ఆధారంగా వెంటనే చర్యలు చేపడుతామని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీజన హామీఇచ్చారు. బుధవారం జీడిమెట్ల సర్కిల్ గణేష్‌నగర్ డివిజన్ పాపయ్యయావ్‌నగర్ రెయిన్‌బో హైస్కూల్లో ఆమె వివిధ విభాగాల అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా బస్తీలలోని మౌళిక సదుపాయాలైన రోడ్లు, వీధిదీపాలు, డ్రైనేజీ సమస్యలపై సంక్షేమ సంఘాల ప్రతినిధులను అడిగి వివరాలను రాబట్టారు. ఆయా కాలనీలలోని సమస్యలు, మౌళిక సదుపాయాలు, ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను తెలుసుకున్నారు. గత కొంతకాలంగా సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో ఇస్తున్న ఫిర్యాదుల పరిష్కారంతోపాటు దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను ప్రజలకు వివరించి చెప్పారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణి ద్వారా వచ్చే ప్రతి సమస్యను పరిగణలోకి తీసుకుని పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నట్లు వివరిచారు. పద్మానగర్ ఫేజ్ ఒకటిలో నీటిఎద్దడితో సతమతమవుతున్నట్లు సంక్షేమసంఘ వర్కింగ్ ప్రసిడెంట్ ఒక్కంటి దయాకర్ సిఎంసి కమిషనర్ శ్రీజన దృష్టికి తెచ్చారు. నీటిఎద్దడి పరిష్కారంకోసం తాము గతకొంత కాలంగా మంజీరా వాటర్‌బోర్డు కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించినట్లు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. మెట్రోవాటర్‌వర్క్స్ ఎండి అశోక్‌రెడ్డితో చర్చించి పద్మానగర్ ఫేస్‌ఒకటిలో నెలకొన్న నీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఒక్కంటి దయాకర్ విజ్ఞప్తి చేశారు. పద్మానగర్ ఫేజ్ఒకటి సంక్షేమ సంఘ ప్రధానకార్యదర్శి దేవేందర్‌రెడ్డి, సత్యం, ప్రసాద్‌లతోపాటు రామిరెడ్డినగర్ సంక్షేమసంఘ అధ్యక్షులు గల్వా యాదవరెడ్డి, ఇంద్రసింగ్‌నగర్ సంక్షేమసంఘ అధ్యక్షులు భూషణంలతోపాటు ఎన్‌టిఆర్‌నగర్, దిల్‌ఖుష్‌నగర్ తదితర కాలనీలు, బస్తీల నుండి సంక్షేమసంఘ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొని తమతమ సమస్యలను సిఎంసి కమిషర్ శ్రీజన దృష్టికి తీసుకురాగా వాటిని వెంటనే పరిష్కరిస్తామని హామీఇచ్చారు. సమావేశంలో వెంకటేశ్వరనగర్ సంక్షేమసంఘ అధ్యక్షులు నాగదీప్‌గౌడ్, ఎన్‌టిఆర్‌నగర్ సంక్షేమసంఘ అధ్యక్షులు బాస్కర్ లతోపాటు వివిధ సంక్షేమసంఘాల ప్రతినిధులు పాల్గొని తమతమ సమస్యలను ఏకరువుపెట్టారు.

చిక్కడపల్లి కొత్త ఎసిపిగా రణవీర్ రెడ్డి

..రమేష్ కుమార్‌ను డిజిపి కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశం

చిక్కడపల్లి ఏప్రిల్ 29 (ప్రభాతవార్త) : చిక్కడపల్లి పోలీస్ సబ్ డివిజన్ అసిస్టెంట్ కమీషనర్ అఫ్ పోలీస్‌గా జి. రణవీర్ రెడ్డి ని నియమిస్తూ రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనర ల్ శివధర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేసారు. ప్రస్తుతం హైదరాబాద్ సిటీ స్పెషల్ బ్రాంచ్ లో ఏసీపీగా పనిచేస్తున్న జి. రణవీర్ రెడ్డిని చిక్కడపల్లి ఏసీపీగా బదిలీ చేశారు. ఇప్పటివరకు చిక్కడపల్లి ఏసీపీగా విధులు నిర్వహించిన ఎల్. రమేష్ కుమార్ బదిలీ అయ్యారు. రమేష్ కుమార్ వెంటనే డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉత్తర్వు ల్లో పేర్కొన్నారు. 1991 బ్యాచ్ కు చెందిన రణవీర్ రెడ్డి సబ్ ఇన్స్పెక్టర్ గా హైదరా బాద్ నగరంలోనే ట్రాఫిక్ తో పాటు వివిధ ఎస్ ఆర్ నగర్ పోలీస్ స్టేషన్ లలో పని చేసారు. ఇన్స్పెక్టర్ గా మంగళహాట్, ఇంటెలిజెన్స్ చాలాకాలం పని చేసారు. ఏసీపీ గా పదోన్నతి పై సెంట్రల్ క్రైమ్ స్టేషన్, మాదాపూర్, పిటిసి అంబర్ పెట్, స్పెషల్ బ్రాంచ్‌లో సమర్ధవంతంగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం చిక్కడపల్లి ఏసీపీగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా రణవీర్ రెడ్డి మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తానని అన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. బాధితులకు ఎలాంటి సమస్య ఉన్నా సత్వరమే పరిష్కరించడానికి శాయాశక్తులా ప్రయత్నిస్తానన్నారు. ఎటువంటి సమస్యలున్నా వాటి పరిష్కారం కకోసం నేరుగా కలువవచ్చని, ఫ్రెండ్లీ పోలీసింగ్ వాతావరణాన్ని గాంధీనగర్ చిక్కడపల్లి పోలీసుసబ్ డివిజన్ పరిధిలోని చిక్కడపల్లి, ముషీరాబాద్, కాచిగూడ పోలీసుస్టేషన్‌ల పరిధిలో మరింత ధృడం చేస్తానన్నారు. డివిజన్‌లో నేరాల అదుపునకు మూడు పోలీసుస్టేషన్‌ల పరిధిలో నిఘాను మరింత పెంచడంతో పాటు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూస్తానన్నారు. అసాంఘిక శక్తులపైన పోలీసులు ఉక్కుపాదం మోపుతానన్నారు. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ వారి సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణలో మరింత వేగవంతంగా కృషి చేస్తానని అన్నారు. ఈ రకంగా ప్రజలందరి సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణలో మరింత మెరుగ్గా పనిచేస్తానన్నారు. ప్రజల సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేస్తానని అన్నారు.

విద్యుత్ షాక్‌కు గురైన లైన్‌మాన్

తీవ్రగాయాలతో వైద్యశాలలో చికిత్స..పరిస్థితి విషమం..?

దుండిగల్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మత్తులు చేస్తుండగా ఓ లైన్‌మెన్ విద్యుత్ షాక్‌కు గురైయ్యాడు. ఈప్రమాదంలో తీవ్రగాయాలపాలైన లైన్‌మెన్‌ను చికిత్స కోసం వైద్యశాలకు తరలించగా పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తుంది. వివరాల్లోకి వెళితే జీడిమెట్ల డివిజన్, దొమ్మర పోచంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో నాగబాబు అనే వ్యక్తి లైన్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. బుధవారం సబ్‌స్టేషన్ పరిధిలోని అరుంధతి వైద్యశాల సమీపంలో ఉన్నటువంటి ఒక ట్రాన్స్‌ఫార్మర్‌లో సమస్యలు తలెత్తినట్లు సమాచారం అందుకున్న లైన్‌మెన్ నాగబాబు అక్కడి చేరుకున్నాడు. విద్యుత్ లైన్లను పరిశీలించిన ఆయన ట్రాన్స్‌ఫార్మర్‌పైన సమస్య ఉన్నట్లు గుర్తించి ట్రాన్స్‌ఫార్మర్ పైకి ఎక్కి సమస్యను పరిష్కరిస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురైయ్యాడు. ఈప్రమాదంలో నాగబాబు ఒంటిపై తీవ్రగాయాలై పైనుండి పడిపోయాడు. గమనించిన సహ సిబ్బంది హుటాహుటిన చికిత్స కోసం సుచిత్రలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. విషమ స్థితిలో చికిత్స పొందుతున్నట్లు తెలుస్తుంది. కాగా గత 15 రోజుల కిందట ఇదే జీడిమెట్ల డివిజన్ పరిధి బహాదూర్‌పల్లిలో సైతం లైన్‌మెన్ విద్యుత్ షాక్‌కు గురై చికిత్స పొందుతూ మరణించారు. ఆ సంఘటన మరువక ముందే అదే తరహాలో మరో ఘటన చోటు చోసుకోవడంతో సిబ్బంది ఆందోళనకు గురవుతున్నారు. ఘటనలకు సంబంధించి పూర్తిస్థాయి సమాచారం ఇవ్వడంలో విద్యుత్ అధికారులు విముఖతను చూపడంతో స్థానికంగా అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారుల నిర్లక్ష్య వైఖరి వలనే కిందిస్థాయి సిబ్బంది ప్రాణాల మీదకు వస్తున్నట్లు పలువురు సిబ్బంది అభిప్రాయపడుతున్నారు. ఏది ఏమైనా ఈ రెండు ఘటనలకు సంబంధించి పూర్తి స్థాయిలో విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇందిరమ్మ గృహప్రవేశంలో పాల్గొన్న నేతలు

కుల్కచర్ల,ఏప్రిల్,29 ప్రభాతవార్త: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదల సొంతింటి కల సాకారం అవుతుందని డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు భీంరెడ్డి, మార్కెట్ కమిటి ఛైర్మన్ బిఎస్ ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు.మండల పరిధిలోని కుసుమసముద్రం గ్రామంలో వర్ణిక సత్యకు ఇందిరమ్మ ఇంల్లు మంజురు కావడంతో నిర్మాణం పూర్తి చేసుకుని బుధవారం గృహ ప్రవేశం నిర్వహించారు. ఈ గృహప్రవేశాలకు స్థానిక నాయకుతలో కలిసి వారి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటి ఛైర్మన్ బిఎస్ ఆంజనేయులు ముదిరాజ్ మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల చేపట్టిన పథకం ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తికావడం లబ్దిదారులు నూతన గృహప్రవేశంచేయడం ఎంతో సంతోషంగా ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో రాంపూర్ సర్పంచ్ తిరుపతయ్య, వెంకటయ్య గౌడ్, మాజి ఎంపిటిసి లక్ష్మయ్య, బాబు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పగిలిన మిషన్ భగీరథ పైపులైన్

మరమ్మతు పనులు చేపట్టాలని డిసికి వినతి

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 29, ప్రభాత వార్త: పోచారం డివిజన్ పరిధి యంనంపేట్‌లో మిషన్ భగీరథ నీరు పైపులైన్ లీకేజీ అయి గత మూడు నెలలుగా వృథాగా రోడ్డు ప్రవహిస్తుందని తక్షణమే పైపులైన్‌కు మరమ్మత్తు పనులు చేపట్టాలని కోరుతూ గ్రామస్తులు నర్సింహ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం ఘట్‌కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వాణిని కలిసి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. గ్రామంలో తాగునీటి కొరత జనాలను వేధిస్తుండగా మరోవైపు మిషన్ భగీరథ పైపులైన్ పగిలి వృథాగా నీళ్ల పోతున్నాయని దీంతో రోడ్డు బురదమయంగా మారిందని గ్రామస్తులు పేర్కొన్నారు.

గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులు ప్రారంభం

దుద్యాల్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త: మండల పరిధిలోని కుదురుమల్ల గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను సర్పంచ్ లాలప్ప ప్రారంభించారు. శిథిలావస్థకు చేరిన గ్రామపంచాయతీ భవనం స్థానంలో 30 లక్షలతో పత్యేక నిధులతో గ్రామపంచాయతీ భవనం నిర్మించనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కొడంగల్ నియోజకవర్గం ఇన్చార్జి తిరుపతిరెడ్డి సహకారంతో గ్రామంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నా యన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాధ, ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ సురేందర్ రెడ్డి, నాయకులు రఘుపతి, యాదవ రెడ్డి, జనార్ధన్ గౌడ్, హనుమంతు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

మోమిన్‌పేట్, ఏప్రిల్ 29. ప్రభాతవార్త: రైతులు పండించిన పంటలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో విక్రయిస్తే పంటకు తగిన ధరతో రైతులకు లాభం చేకూరుతుందని మర్పల్లి మార్కెట్ కమిటి చైర్మెన్ వై. మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మోమిన్‌పేట్ మండల కేంద్రంలో నాఫెడ్ టీజీ మార్క్‌ఫెడ్ వారి ఆధ్వర్యంలో పీఏసీఎస్ నందు మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రైతులు పండించిన మొక్కజొన్నలు దళారుల వద్ద మోసపోకుండా నేరుగా మార్కెట్ కమిటీలో విక్రయించినచో పంటకు తగిన గిట్టుబాటు ధర లభిస్తుందని అన్నారు. ప్రభుత్వం క్వింటాలుకు 2400, రూపాయల మద్దతు ధర ప్రకటిందని కనుక రైతు తమ పట్టాదారు పాసు పుస్తకము జిరాక్స్, బ్యాంకు అకౌంట్ పాస్ పుస్తకము జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, ఏఈఓ లేదా ఆర్ఎస్ఎస్ ఆన్‌లైన్ లో ఉన్న రైతు ద్రువీకరణ పత్రం సమర్పించి తమ పంటలను ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా విక్రయించుకోవాలని తెలిపారు. రైతు తమ పంట నాణ్యత కలిగి ఉన్నచో ఖచ్చితంగా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో పాటు, తూకంలో కూడా ఎలాంటి మోసాలకు తావు లేకుండా అమ్ముకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు శంకర్ యాదవ్, మాధవి పీఏసి అధారి, నాగార్జున డీసీఓ, చెంద్రయ్య ఆడిట్ అధికారి, మండల రెవెన్యూ తహసిల్దారు రవిందర్, టీజీ మార్క్‌ఫెడ్ ప్రతినిధులు, సీనియర్ నాయకులు చెంద్రయ్య, గిరిసింగ్, ఎరాజ్ పాషా, మహిపాల్, సత్యనారాయణగౌడ్, బుచ్చయ్య, సహకార బ్యాంకు మేనేజర్ నారాయణ రెడ్డి, సీఈఓ శేఖర్, సిబ్బంది బాలయ్య, రవి, రమేష్, సందీప్ కుమార్, శివకుమార్, రాజు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నల్లవాగు టిజిఎస్‌డబ్బుఆర్ఎస్‌లో 100శాతం ఉత్తీర్ణత

–581 మార్కులతో టాపర్‌గా బెస్సీ జగదీష్

సిర్గాపూర్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త: మండల పరిధిలోని నల్లవాగు టిజిఎస్‌డబ్లుఆర్ఎస్ పాఠశాలలో 10వ తరగతిలి ఇటీవల పరీక్షలురాసిన 77మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. బుధవారం విడుదలచేసిన 10వతరగతి వార్షికఫలితాలను ప్రభుత్వం విడుదల చేసింది. 581 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా బెస్సీ జగదీష్ నిలువగా 580 మార్కులతో జాదవ్ విజయ్‌సింగ్ రెండవస్థానంలో, 574 మార్కులతో ఉపేంద్రకుమార్ మూడవస్థానంలో నిలిచారు. పాఠశాల టాపర్లుగా నిలిచిన విద్యార్థులతోపాటు ఉత్తీర్ణులయిన 77మంది విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

టెన్త్‌లో మండల టాపర్‌గా వైశాలి

సిర్గాపూర్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త: బుధవారం విడుదల చేసిన 10వ తరగతి వార్షిక పరీక్షల్లో 585 మార్కులు సాధించిన తెలంగాణ ట్రైనర్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని సభావట్ వైశాటి మండల టాపర్‌గా నిలచినట్లు మండల విద్యాధికారి నాగరం శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రమైన సిర్గాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ప్యాట భవాని 582 మార్కులతో రెండవ స్థానంలో నిలిచిందన్నారు. నల్లవాగు సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థి బస్సీ జగదీష్ 581 మార్కులు సాధించి మండల మూడవ స్థానం దక్కించుకున్నట్లు ఎంఈఓ వివరించారు. మండల టాపర్‌లుగా నిలిచిన విద్యార్థులను ఎంఈఓ నాగారం శ్రీనివాస్ ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలతు తెలిపారు.

కంది మండలంలో వందశాతం ఉత్తీర్ణత

–597 మార్కులతో మండల టాపర్లుగా మాధవ్, శశాంక్

కంది, ఏప్రిల్ 29, ప్రభాతవార్త: మండలంలోని ఆయా గ్రామాల్లోని 12 పాఠశాలల్లో 10వ తరగతిలో విద్యను అందుకుని ఇటీవల పరీకలు రాసిన విద్యార్థులందరూ ఉత్తీర్ణులు కావడంతో మండలంలో అన్ని పాఠశాలలు శతశాతం ఉత్తీర్ణత సాధించాయి. 597 మార్కుల సాధించిన కేశవరెడ్డి హైస్కూల్ విద్యార్థులు ఎం మాదవ్, ఈ శశాంక్‌లు మండల టాపర్‌లుగా నిలిచారు. మండల కేంద్రమైన కందిలోని జడ్పీహెచ్ఎస్‌లో 32 మంది పరీక్షలకు హాజరు కాగా 32 మంది విద్యార్థులు ఉత్తీర్ణులుకాగా పాఠశాల టాపర్‌లుగా 572మార్కులతో ఎం అనుషా, 570మార్కులతో స్నేహశ్రీలు నిచివారు. మామిడిపల్లి జడ్పీహెచ్ ఎస్‌లో 38మందికి 38మంది ఉత్తీర్ణులుకాగా 578మార్కులతో కె.సాయి కిరణ్, 569 మార్కులతో వి.శ్రావణిలు టాపర్‌లుగా నిలిచారు. ఓడిఎఫ్ జడ్పీహెచ్ఎస్‌లో 25మందికి 25మంది ఉత్తీర్ణులు కాగా 575 మార్కులతో వి.పావని, 572మార్కులతో యం.అలేఖ్య టాపర్‌లుగా నిలిచారు. ఎద్దు మైలారం జడ్పీహెచ్ఎస్ నుంచి 32మందికి 32మంది ఉత్తీర్ణులుకాగా 588 మార్కులతో పి.ధరణి, 584మార్కులతో యం.భువనలు, ఇంద్రకరణ్ జడ్పీహెచ్ఎస్‌లో 41మందికి 41మంది ఉత్తీర్ణులు కాగా 585 మార్కులతో పి.పవన్‌కుమార్, 575మార్కులతో ఎ.స్పందన టాపర్‌లుగా నిలిచారు. కలివేముల జడ్పీహెచ్‌స్‌లో 19మందికి 19మంది ఉత్తీర్ణులుకాగా 585మార్కులతో పి.అర్చన, 573మార్కులతో సిహెచ్.ప్రియాంకలు, చేరియాల జడ్పీహెచ్ఎస్‌లో 98మంది 98మంది ఉత్తీర్ణులుకాగా 586మార్కులతో జానవి, 585మార్కులతో శ్యామ్‌చరణ్‌లు, కంది టీఎంఆర్ఈఎస్ నుంచి 69మందికి 69మంది ఉత్తీర్ణులుకాగా 598మార్కులతో యం.పూజిత, 587మార్కులతో యండి రేహన్‌లు, కంది కెజిబివీ నుంచి 34మందికి 34మంది ఉత్తీర్ణులు కాగా 569మార్కులతో డి.మైమూనా, 566మార్కులతో విజ్ఞేశ్వరి, కేశవరెడ్డి హైస్కూల్ నుంచి 192మంది విద్యార్థులకు 192మంది విద్యార్థులు ఉత్తీర్ణులుకాగా 597మార్కులతో యం.మాదవ్ ఈ.శశాంక్‌లు టాపర్‌లుగా నిలిచారు. కోత్వాల్ హైస్కూల్‌నుంచి 38మంది పరీక్షలు రాయగా 38 మంది ఉత్తీర్ణులుకాగా 584మార్కులతో మేవిష్ ముస్కార్, 578మార్కులతో ఎన్.చందన, కందిలోని సెయింట్ అన్స్ పాఠశాల నుంచి 29మంది విద్యార్థులకు 29మంది విద్యార్థులు ఉత్తీర్ణులుకాగా, 580మార్కులతో వి శ్రవణి టాపర్‌గా నిలిచిందన్నారు.

మండలంలో ఒకరు తప్ప అందరు పాస్

–574 మార్కులతో మండల టాపర్‌గా

మనూర్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త: మండల పరిధిలోని 7 పాఠశాలల్లో 10వ తరగతిలో విద్యను అందుకుని ఇటీవల 10వతరగతి వార్షికపరీక్షలు రాసిన 246మంది విద్యార్థులకుగాను 245మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అయినట్లు మండలవిద్యాధికారి రాజశేఖర్‌శెట్కార్ తెలిపారు. రాయిపల్లి జడ్పీహెచ్ఎస్ నుంచి 22మంది విద్యార్థులు పరీక్షలురాయగా 22మంది విద్యార్థులు ఉత్తీర్ణులుకాగా 559మార్కులతో పాఠశాల టాపర్‌గా, బోరంచజడ్పీహెచ్ఎస్‌నుంచి 37మందికి 37మంది ఉత్తీర్ణులుకాగా 553బెల్లాపూర్ జడ్పీహెచ్ఎస్‌లో 15మందికి 15మంది ఉత్తీర్ణులు కాగా 545మార్కులతో టాపర్‌గా, మనూర్ జడ్పీహెచ్ఎస్‌నుంచి 91మంది విద్యార్థులు ఉత్తీర్ణులుకాగా, 574మార్కులతో, శెల్గిర జడ్పీహెచ్ ఎస్ నుంచి 17మందికి 17మంది ఉత్తీర్ణులుకాగా 553మార్కులతో పాఠశాల టాపర్‌గా, ఎల్గోయి జడ్పీహెచ్ఎస్‌లో 20మందికి 20మంది ఉత్తీర్ణులుకాగా 551మర్కులతో టాపర్‌గా, పుల్‌కుర్తి కేజీబీవీ పాఠశాలలో 43మందికి 43 మంది ఉత్తీర్ణులుకాగా 559మార్కులతో పాఠశాల టాపర్లుగా నిలిచినట్లు మండలవిద్యాధికారి శెట్కార్ రాజశేఖర్ వివరించారు. ఉత్తీర్ణులైన విద్యార్థుల తోపాటు పాఠశాల, మండల టాపర్‌లుగా నిలిచిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

పుల్‌కుర్తి కెజిబివిలో వందశాతం ఉత్తీర్ణత

మనూర్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త: మండలపరిధిలోని పుల్‌కుర్తి గ్రామంలోని కెజిబివిపాఠశాలలో 10వతరగతి లో విద్యను అందుకున్న విద్యార్థినులందరూ ఉత్తీర్ణులు అయినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి తెలిపారు. 559 మార్కులతో ఏ.నాగరాణి పాఠశాల టాపర్‌గా, 557మార్కులతో నిఖిత రెండవటాపర్‌గా, 557మార్కులతో బీ.కిర్తన మూడవటాపర్‌గా నిలిచినట్లు ప్రిన్సిపాల్ రాజేశ్వరి తెలిపారు.

మండలంలో టెన్త్ ఫలితాల టాపర్లు

జోగిపేట, ఏప్రిల్ 29, ప్రభాతవార్త: అందోలు మండలంలోని ప్రభుత్వం ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి ఫలితాల్లో 8 పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించగా, రెండు ఉన్నత పాఠవాలల్లో మాత్రం 98, 99శాతం ఉత్తీర్ణత సాధించారు. కాగా డాకూరు జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలకు చెందిన మహ్మద్ రీహాన్ 582 మార్కులు సాధించి మండలంలో ప్రభుత్వ హైస్కూల్ తరపున ప్రథమస్థానంలో నిలవగా, జోగిపేట బాలుర ఉన్నతపాఠశాలకు చెందిన జరాద్ రాజు 574 మార్కులతో ద్వితీయస్థానంలో నిలిచారు.మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో 97శాతం ఉత్తీర్ణత సాధించటం పట్ల మండలవిద్యాధికారి క్రిష్ణ సంతోషం వ్యక్తంచేశారు.

మొగుడంపల్లి మండలంలో 99.05శాతం ఉత్తీర్ణత

మొగుడంపల్లి, ఏప్రిల్ 29, ప్రభాతవార్త: మండలంలోని ఆయా గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతిలో విద్యను ఆర్జించి ఇటీవల పరీక్షలు రాసిన 205 మందిలో 204 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అయినట్లు మండల విద్యాధికారరి జాఫర్ తెలిపారు. ఉత్తీర్ణులు అయిన విద్యార్థులకు అందుకు సహకరించిన ఉపాధ్యాయులు, పోషకులకు ఎంఈఓ జాఫర్ అభినందించి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

న్యాల్‌కల్ మండలంలో 99.34శాతం ఉత్తీర్ణత

న్యాల్‌కల్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త: మండలంలోని 9 పాఠశాలల్లో (జడ్పీహెచ్ఎస్, కేజీబీవీ పాఠశాలల్లో) 10వ తరగతిలో విద్యను ఆర్జించిన విద్యార్థులు ఇటీవల 10వ తరగతి వార్షిక పరీక్షలు రాయగా ముగ్గురు విద్యార్థులు మినహా మిగతా విద్యార్థులు ఉత్తీర్ణలు అయినట్లు మండల విద్యాధికారి మారుతి రాథోడ్ తెలిపారు. మండలంలోని 9 పాఠశాలల విద్యార్థులకు పరీక్షలకు హాజరై పరీక్షలు రాయగా మండల పరిధిలోని రేజింతల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు మండల టాపర్‌లుగా నిలిచారు. ఇందుకు సంబంధించి పాఠశాలల వారిగా వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లోని జడ్పీహెచ్ఎస్‌లో 116 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 113 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా 561 మార్కులతో విద్యార్థి పాఠశాల టాపర్‌గా నిలిచాడు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలైన మిర్జాపూర్(బి)లో 67 మంది, హద్నూర్‌లో 63 మంది, చాల్కిలో 41 మంది, మెటల్‌కుంటలో 53 మంది, మామిడ్గిలో 35 మంది, రేజింతల్‌లో 26 మంది, చీకుర్తిలో 22 మంది, న్యాల్‌కల్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 22 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా అందరు విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. కాగా రేజింతల్ పాఠశాల విద్యార్థినులు భూపతల్లి పవిత్ర 575 మార్కులతో పాఠశాల, మండల టాపర్‌గా నిలువగా అదే పాఠశాలకు చెందిన మాందాపూరం భార్గవి 573 మార్కులు సాధించి పాఠశాల ద్వితీయ, మండల ద్వితీయ టాపర్‌గా నిలిచి అందరి అభినందనలు అందుకున్నారు.

మునిపల్లి మండలంలో 99.79శాతం ఉత్తీర్ణత

మునిపల్లి, ఏప్రిల్ 29, ప్రభాతవార్త: బుధవారం వెలువడిన పదవతరగతి పరీక్షఫలితాల్లో మునిపల్లి మండలంలో 493మంది విద్యార్థులకుగాను 492మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మండలంలోని కంకోల్, బుదేరా, మల్లిఖార్జునపల్లి, మునిపల్లి, ఖమ్మంపల్లి, లోనికలాన్, తాటిపల్లి, పెద్దచెల్మెడ, అంతారం, మేళాసంగెం, కంకోల్ ఉర్దూ మీడియం జిల్లా పరిషత్ పాఠశాలలతోపాటు లింగంపల్లి గురుకుల పాఠశాల, మునిపల్లి మోడల్ స్కూల్ పాఠశాలల విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. పెద్ద గోప్లారంలో 14 మంది విద్యార్థులకు గాను 13 మంది ఉత్తీర్ణులు అయ్యారు.లింగపల్లి పాఠశాలకు చెందిన భరత్‌కుమార్ 566 మార్కులు సాధించి మండలంలో ప్రథమస్థానంలో నిలివగా మునిపల్లి మోడల్ స్కూల్ విద్యార్థిని నందీశ్వరికి 565 మార్కులతో ద్వితియ స్థానంయదక్కింది. మండలంలో అన్ని ఉన్నత పాఠశాలలు 99 శాతం పైగా ఉత్తీర్ణత సాధించడం పట్ల మండల విద్యాధికారి భీంసింగ్ ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను మండల ప్రజలు అభినందించారు.

సంగారెడ్డి జిల్లాలో పదవతరగతి ఫలితాలు

సంగారెడ్డి బ్యూరో, ఏప్రిల్ 29, ప్రభాతవార్త: బుధవారం ప్రకటించిన పదవతరగతి ఫలితాలలో సంగారెడ్డి జిల్లా 98.69 శాతం ఉత్తీర్ణత సాధించిందని జిల్లా విద్యాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. పదవతరగతి పరీక్షలకు జిల్లానుంచి 24573మందివిద్యార్థులు హాజరుకాగా, 24252 మంది ఉత్తీర్ణులు అయ్యారని ఆయన తెలిపారు. పదవ తరగతి పరీక్ష ఫలితాలలో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులు సంగారెడ్డి జిల్లాను రాష్ట్రంలో ఆరవస్థానంలో నిలిపారని అన్నారు. జిల్లానుంచి 483 పాఠశాలల విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, 365 పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించారని జిల్లా విద్యాధికారి తెలిపారు. రీకౌంటింగ్ కోరుకునే విద్యార్థులు సబ్జెక్టుకు 500 రూపాయలు చొప్పున మే నెల 14లోపు ఆన్లైన్లో డబ్బులు చెల్లించాలని, రీవెరిఫికేషన్ కోరుకునే అభ్యర్థులు సబ్జెక్టుకు వెయ్యి రూపాయల చొప్పున మే నెల 14 లోపు చెల్లించాలని సంగారెడ్డి జిల్లా విద్యాధికారి ప్రకటనలో తెలిపారు.

పదవ తరగతి ఫలితాలలో హత్నూర మండల విద్యార్థుల ప్రభంజనం

హత్నూర, ఏప్రిల్ 29, ప్రభాతవార్త: పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో హత్నూర మండలంలో 11 ప్రభుత్వ పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణతసాధించారని హత్నూర మండల విద్యాధికారి వెంకట్ నరసింహులుగౌడ్ తెలిపారు. మండలంలో మొత్తం 18 పాఠశాలలకు సంబంధించిన విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని అన్నారు. హత్నూరలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ముస్కాన్ ఫాతిమా 567, మహీన్ ఫాతిమా 567(ఇద్దరూ అక్కాచెల్లెళ్లు), తెలంగాణ మోడల్ స్కూల్ గుండ్లమాచునూర్ విద్యార్థిని శివాని 567 మార్కులు సాధించారని, జెడ్పి ప్రభుత్వ ఉన్నత పాఠశాల దౌల్తాబాద్‌కు చెందిన ప్రియవర్షిని 560 మార్కులు, సిరిపురం ఉన్నత పాఠశాలకు చెందిన స్పందన 551 మార్కులు సాధించారని అన్నారు. హత్నూరాలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో పదవ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తెలిపారు. 37మంది పరీక్షలు హాజరుకాగా అందరూ ఉత్తీర్ణులయ్యారని గత 13సంవత్సరాల నుంచి 100శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నామని అన్నారు పాఠశాలకు చెందిన విద్యార్థిని సంజన 527 మార్కులు సాధించిందని ప్రిన్సిపల్ తెలిపారు.

పది ఫలితాల్లో మెరిసిన ములుగు, సింగన్నగూడ విద్యార్థులు

ములుగు, ఏప్రిల్ 29, ప్రభాతవార్త: బుధవారం విడుదలైన పదవతరగతి పరీక్షాఫలితాలలో ములుగు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు 12పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలకేంద్రమైన ములుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి వాసు 536 మార్కులు సాధించి ప్రథమస్థానంలో నిలువగా, సింగన్నగూడ పాఠశాలకు చెందిన పూజ 532 మార్కులు సాధించింది. కెజిబివిలో చదువుతున్న చంద్రిక 538 మార్కులు సాధించింది. మండలకేంద్రమైన ములుగులోని స్వామి వివేకానంద పాఠశాలకు చెందిన టి.ప్రణయ్ 565, అక్షిత 544 మార్కులతో మండల టాపర్లుగా నిలిచారు. వందశాతం సాధించిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు తునికిబొల్లారం, కొట్యాల, కెజిబివి కాగా ప్రభుత్వ పాఠశాలలు, స్వామివివేకానంద, గీతాంజలి పాఠశాలల విద్యార్థులను మండల విద్యాధికారి ఉదయభాస్కర్‌రెడ్డి అభినందించారు.

మండల టాపర్‌గా నిలిచిన కెజిబివి విద్యార్థిని

మర్కుక్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త: మండలకేంద్రం మర్కుక్‌లోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో పదవ తరగతిలో 42మంది పరీక్షలు రాయగా 42 మంది ఉత్తీర్ణులయ్యారని విద్యాలయం ప్రత్యేకాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. 524 మార్కులతో విద్యార్థిని ఆర్.సింధూర మండల టాపర్‌గా నిలువగా ఎం.నందిని 501, జి.వర్ష 487 మార్కులు సాధించి సత్తా చాటినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

వర్గల్ మండలంలో పరీక్షాఫలితాలు

వర్గల్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త: వర్గల్ మండలపరిధిలోని నెంటూర్‌గ్రామంలోగల విశ్వశాంతి విద్యానికేతన్ హైస్కూల్ విద్యార్థులు కె.అంజలి 561 మార్కులు సాధించి మండలంలో మొదటి స్థానం, డి.అన్వేష్ 560 మార్కులు సాధించి మండలంలో రెండవ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ దేవి దయాకర్ తెలిపారు. ప్రతి సంవత్సరం వందశాతం ఫలితాలతో మండలంలో పాఠశాలను ప్రథమస్థానంలో నిలిపిన విద్యార్థులను అభినందించారు. విజయానికి కారకులైన ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు.

జిల్లాస్థాయిలో మెరిసిన ప్రతిభ

రామాయంపేట, ఏప్రిల్ 29, ప్రభాతవార్త: రామాయంపేటలోని మంజీరా విద్యాలయం విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరచారు. ఈరోజు వెలువడిన ఫలితాల్లో డి.సిరివెన్నెల 600 మార్కులకు గాను 586 మార్కులు సాధించి మండల స్థాయిలో మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. అదే విధంగా మహతి 585 మార్కులు సాధించి పాఠశాలకు గౌరవం తీసుకువచ్చింది. విద్యార్థినులు సాధించిన ఈ విజయంపై తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేశారు. జిల్లా స్థాయిలో కూడా మెరుగైన స్థానం సాధించడం విశేషమని పేర్కొన్నారు. కృషి, పట్టుదలతోపాటు సమయస్ఫూర్తితో చదవడం, పరీక్షలు రాయడం వల్లే ఈఫలితాలు సాధ్యమయ్యాయని విద్యార్థినులు తెలిపారు. తమ విజయానికి తోడ్పడిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్ కుమార్, కరస్పాండెంట్ వాసవి జితేందర్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు. పాఠశాల తరఫున విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మరియు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

పాపన్నపేట మండలంలో 91.8 శాతం ఉత్తీర్ణత..

పాపన్నపేట, ఏప్రిల్ 29, ప్రభాతవార్త: పదోతరగతి ఫలితాల్లో పాపన్నపేట మండలం 91.8శాతం ఉత్తీర్ణత సాధించింది. పాపన్నపేట మండలంలో 11 ఉన్నత పాఠశాలలో 550 మంది విద్యార్థులు పరీక్షలురాయగా 505మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. గాంధారి పల్లి, చికోడ్ లింగయి పల్లి, మల్లంపేట్, నాగసాన్ పల్లి, కొడుపాక పాఠశాలలో100 ఉత్తీర్ణత సాధించగా మండల టాపర్‌గా చికోడ్ లింగయి పల్లి పాఠశాల విద్యార్థి హర్షవర్ధన్ రెడ్డి 600 మార్కులకు 579మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. పాపన్నపేట పిఎమ్‌శ్రీ ఉన్నత పాఠశాలలో 120 మంది విద్యార్థులకుగాను 99మంది ఉత్తీర్ణత సాధించారు. కాగామండలంలో 11పాఠశాలలోని 550 మందివి ద్యార్థులకుగాను 505మంది విద్యార్థులు (91.08 శాతం) ఉత్తీర్ణత సాధించారు.

వెల్దుర్తి జడ్‌పిహెచ్ఎస్‌లో పదవ తరగతిలో 100శాతం ఉత్తీర్ణత

వెల్దుర్తి, ఏప్రిల్ 29, ప్రభాతవార్త: బుధవారం విడుదలైన పదవతరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలో విద్యార్థిని విద్యార్థులు100 శాతం ఉత్తీర్ణత సాధించారు విద్యార్థులు ప్రతిభను చాటారు. వెల్దుర్తి మండల టాపర్‌గా 560 మార్కులు సాధించి టాపర్గా నిలిచారు. రెండవ టాపర్గా 556 మార్కులుసాధించిన మేఘన. మూడో టాపర్‌గా 553మార్కులు సాధించిన అప్సికలు ప్రశంసలందుకున్నారు. మండల కేంద్రమైన వెల్దుర్తి ఉన్నత పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులు 150 మంది పరీక్షలురాయగా 150మంది ఉత్తీర్ణతసాధించారు. కుక్కునూరులో 89మందికి 89మంది ఉత్తీర్ణత సాధించారు. మండలపరిధిలో 28మంది. బండపోసానిపల్లిలో 34 మంది మానేపల్లిలో 24మంది ఉత్తీర్ణతసాధించారు. కస్తూర్బా గాంధీ పాఠశాలలో 44 మంది విద్యార్థినిలు పదో తరగతి పరీక్షలు రాయిగా 100 ఉత్తీర్ణతతో 44 మంది ఉత్తీర్ణత సాధించారు.

రామాయంపేట మండలంలో 97 శాతం ఉత్తీర్ణత

రామాయంపేట, ఏప్రిల్ 29, ప్రభాతవార్త: రామాయంపేట మండలంలో పదో తరగతి ఫలితాలు ఈసారి ఉత్సాహాన్ని నింపాయి. బుధవారం వెలువడిన ఫలితాల్లో మండల వ్యాప్తంగా 97 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ఎంఈవో శ్రీనివాస్ తెలిపారు. మొత్తం 13 ప్రభుత్వ పాఠశాలలు ఉన్న మండలంలో విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారని చెప్పారు. ప్రత్యేకంగా లక్ష్మాపూర్, కోనాపూర్, రాయిలాపూర్, ఝాన్సీ లింగాపూర్ మరియు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించడం విశేషమని పేర్కొన్నారు. ఈ పాఠశాలల విద్యార్థులు అందరూ ఉత్తీర్ణత సాధించడం ఉపాధ్యాయుల శ్రమకు నిదర్శనమని తెలిపారు. విద్యార్థుల కృషి, పాధ్యాయుల బోధన నైపుణ్యం, తల్లిదండ్రుల ప్రోత్సాహం కలిసి ఈ విజయాన్ని సాధ్యంచేశాయని ఎంఈవో శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

సత్తా చాటిన కస్తూర్బా విద్యార్థులు

రామాయంపేట, ఏప్రిల్ 29, ప్రభాతవార్త: రామాయంపేటలోని కస్తూర్బా గాంధీ విద్యాలయం విద్యార్థులు ఈసారి పదో తరగతి ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచి సత్తా చాటారు. పాఠశాలలో 98 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ప్రిన్సిపల్ అనురాధ తెలిపారు. మొత్తం 43 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, అందులో 42 మంది విజయవంతంగా ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థులలో ఆర్. భాగ్యలక్ష్మి 600 మార్కులకు గాను 549 మార్కులు సాధించి పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానం పొందగా, భవాని 529 మార్కులతో ద్వితీయ స్థానం దక్కించుకుంది. ఇతర విద్యార్థులు కూడా మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు గౌరవం తీసుకువచ్చారు. ఈసందర్భంగా ప్రిన్సిపల్ అనురాధ మాట్లాడుతూ, విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం తల్లిదండ్రుల సహకారమే ఈ విజయానికి కారణమని పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.

ర్యాంకులు సాధించిన ముస్లాపూర్ విద్యార్థులు

అల్లాదుర్గం, ఏప్రిల్ 29, ప్రభాతవార్త: అల్లాదుర్గం మండలం ముస్లాపూర్ గ్రామ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ముగ్గురు విద్యార్థులు ర్యాంకులు సాధించారు. 500కు పైగా మార్కులు సాధించి ముస్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పేరు ప్రతిష్టలు తీసుకువచ్చారని ఆ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రశంసించారు. మొల్ల నేహా 573 మార్కులు సాధించి పాఠశాల నుండి ప్రథమ ర్యాంకు సాధించినట్లు, ఇప్పనందు 571 మార్కులతో రెండవ ర్యాంక్, దుర్గాప్రసాద్ 570 మార్కులతో మూడవ ర్యాంకు సాధించినట్లు ఉపాధ్యాయుడు జనార్ధన్ తెలిపారు. పదవ తరగతిలో బాగా కష్టపడి చదివి తమ పాఠశాలకు మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులను జనార్ధన్ ప్రశంసించారు.

పదవతరగతి ఫలితాల్లో చిలిపిచెడ్ మండలం ప్రభంజనం

–100శాతం ఉత్తీర్ణత సాధించడం గర్వకారణం: ఎంఈఓ విఠల్

చిలిపిచెడ్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త: ప్రభుత్వం విడుదల చేసిన పదవ తరగతి ఫలితాల్లో చిలిపిచెడ్ మండలం అద్భుతమైన విజయాన్ని నమోదు చేసింది. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు 100శాతం ఉత్తీర్ణత సాధించడం పట్ల మండల విద్యాశాఖ అధికారి విఠల్ హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సోమక్కపేట నుండి ఎస్ .మణికంఠ గౌడ్ 559 మార్కులు సాధించి మండలంలోని మొదటి స్థానం పొందాడు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫైజాబాద్ అనన్య 550 మార్కులు సాధించి మండలంలో రెండో స్థానం సాధించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల కష్టం, ఉపాధ్యాయుల అంకితభావం మరియు తల్లిదండ్రుల సహకారం వల్లే ఈ అసాధారణ విజయం సాధ్యమైందని కొనియాడారు. ప్రత్యేకించి వెనుకబడిన ప్రాంతం అయినప్పటికీ, విద్యార్థులు క్రమశిక్షణతో చదివి మండలాన్ని జిల్లాలోనే అగ్రగామిగా నిలబెట్టారని ఆయన పేర్కొన్నారు. మండలంలోని అన్ని పాఠశాలలు 100శాతం ఉత్తీర్ణత సాధించాయి. ప్రత్యేక తరగతులు నిర్వహించి, విద్యార్థులను తీర్చిదిద్దిన ప్రధానోపాధ్యాయులకు మరియు ఉపాధ్యాయ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. మండల విద్యాశాఖ తరపున ముమ్మందు కూడా ఇదే స్థాయి నాణ్యమైన విద్యను అందిస్తూ, విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తామని ఎంఈఓ విఠల్ తెలియజేశారు.

టెన్త్‌లో వంద శాతం ఉత్తీర్ణత

కొండపాక, ఏప్రిల్ 29, ప్రభాతవార్త: కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లో పదవ తరగతి పరీక్షల్లో 100 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ఎంఈఓలు పూరుమండ్ల శ్రీనివాస్‌రెడ్డి, బచ్చలి సత్తయ్య తెలిపారు. బుధవారం ప్రభుత్వం విడుదల చేసిన పదవ తరగతి పరీక్షలో కొండపాక మండల పరిధిలో14 ప్రభుత్వ పాఠశాలలు, ఒకటి కెజిబివి, మోడల్ స్కూల్ చదివిన విద్యార్థులు 97.11 శాతం ఉత్తీర్ణులైనట్లు కొండపాక ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. 7 ప్రభుత్వ పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు అయన వివరించారు. తిమ్మారెడ్డిపల్లి, కొండపాక బాలికల, బందారం, అంకిరెడ్డిపల్లి, కెజిబివి, మోడల్ స్కూల్, మహత్మ జ్యోతీరావు పూలే పాఠశాలల్లో 100కు 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. మండల టాపర్‌గా సిర్సనగండ్ల పాఠశాలలో చదివిన సుహానా బేగం 572 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచినట్లు తెలిపారు. అదే విధంగా కుకునూరుపల్లి మండల పరిధిలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత సిదించినట్లు ఎంఈఓ సత్తయ్య తెలిపారు. కుకునూరుపల్లి పాఠశాలలో చదివిన రాచకొండ అర్చన 552 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచినట్లు అయన వివరించారు.లకుడారం గ్రామంలో టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్యార్థుల అధిక మార్కులు సాధించడానికి తోడ్పడిన సర్పంచ్ శిల్ప నర్సింలు, ఉప సర్పంచ్ ఎల్లు శ్రీనివాస్, వార్డు సభ్యులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

నర్సాపూర్ మండలంలో పదవతరగతిలో 83శాతం ఉత్తీర్ణత

నర్సాపూర్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త: పదవతరగతి పరీక్ష ఫలితాలు బుధవారం వెల్లడయ్యాయి. ఈ మేరకు నర్సాపూర్ మండలంలో పదవ తరగతిలో విద్యార్థులు 83 శాతం ఉత్తీర్ణత సాధించారని మండల విద్యాధికారి తారా సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సాపూర్ మండల పరిధిలో మొత్తం 19 ఉన్నత పాఠశాల ఉన్నాయని, ఈ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 935 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. ఈ మెరుగు పదో తరగతి చదువుతున్న 935 మంది విద్యార్థులు ఫైనల్ పరీక్షలు రాయగా ఇందులో 780 మంది విద్యార్థులు పదవ తరగతిలో ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. కాగా కేవలం 155 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించలేరని ఆయన తెలిపారు. ఈ మేరకు నర్సాపూర్ మండల పరిధిలో పదవ తరగతి ఉత్తీర్ణత శాతం 83 కు చేరిందని తెలిపారు. ఈ మేరకు మండల పరిధిలో ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు తమ ప్రదీప చాటి ఉత్తీర్ణులయ్యారని ఎంఈఓ తారా సింగ్ తెలిపారు.

ఆర్యవైశ్యుల సమగ్ర అబివృద్ధి కోసం వీజెన్‌సిస్ నూతన కార్యవర్గం

బేగంపేట ఏప్రిల్ 29,ప్రభాతవార్త

ఆర్యవైశ్యుల సమగ్ర అభివృద్ధి కోసం స్థాపించిన వీజెన్‌సిస్ నూతన కార్యవర్గం ఎంపిక సికింద్రాబాద్ పరిధిలో జరిగింది.బుధవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా వ్యక్తిత్వ వికాస నిపుణు లు గంప నాగేశ్వరరావు,గౌరవ అతిధిగా రాష్ట్ర టూరిజం దెవల ప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ ఉప్పల శ్రీనివాసగుప్తాలు హాజరయ్యారు.ప్రత్యేక అతిధులుగా ఆర్యవైశ్య సంఘం నాయ కులు పసుని శ్రీనివాస్,అద్రి లక్ష్మినారాయణగుప్తా,కటకం శ్రీనివా ప్‌లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన వ్యవ స్థాపక అధ్యక్షుడు వంశీ శంకర్ కొర్లిపర,కార్యదర్శిగా విశ్వేశ్వర్ సూరా,కోశాధికారిగా గోపీకృష్ణ పెంసాని ప్రమాణ స్వీకారం చేసారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్థ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని ప్రకటించారు.ఈ సందర్భంగా హిమాయత్ నగర్ టీటీడీ దేవస్థానంలో ప్రతి రోజు జరుగుతున్న అన్నదాన కార్యక్రమా నికి తమ వంతు మద్దతుగా వంట గది కార్యకలాపాలు మరింత సమర్ధవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఒందు పరిసకాలను వారు సంస్థ తరుపున అందజేసారు.వారిని పలువురు అభినందించారు.

సత్తా చాటిన మోడల్ స్కూల్ విద్యార్థులు

విద్యార్థులను అభినందిస్తున్న మోడల్ స్కూల్ అధ్యాపకులు

జగదేవ్‌పూర్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో బుధవారం వెలువడిన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో జగదేవ్‌పూర్ మండలకేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి తమ సత్తా చాటారు. మోడల్ స్కూల్‌కు చెందిన కోనేటి వర్షిత్ 536, డాకు లాస్య 509, కుకుట్ల మల్లేశ్వరి 482 మార్కులు సాధించడం జరిగిందని పాఠశాల ప్రిన్సిపల్, అధ్యాపక బృందం తెలిపింది. ఈసందర్భంగా ఉత్తమఫలితాలు సాధించిన విద్యార్థులను మోడల్ స్కూల్ ప్రిన్సిపల్, అధ్యాపక బృందం అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కాళ్ళకల్ పదవతరగతిలో 100శాతం ఉత్తీర్ణత

మనోహరాబాద్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త: కాళ్ళకల్ పదవ తరగతిలో 100శాతం ఉత్తీర్ణత సాధించినారు. పాఠశాల నుంచి బాలురు 48, బాలికలు 43మంది మొత్తం 91మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. కటిక సృజన 557, కటిక సంజన 549 మార్కులు సాధించి పాఠశాలనుంచి మొదటి, రెండవ స్థానాల్లో ఉన్నారు. 100శాతం ఉత్తీర్ణత సాధించడం పట్ల ప్రధానోపాధ్యాయులు హరికృష్ణ ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు.

టెన్త్ ఫలితాల్లో 13వ స్థానంలో జిల్లా

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి: జిల్లా టెన్త్ ఫలితాల్లో 97.85శాతం ఉత్తీర్ణతతో 13వస్థానంలో నిలిచింది. జిల్లాలో 15,325 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుగా కాగా 14,995మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. బాలుర విభాగంలో 7,752మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 7,540 ఉత్తీర్ణత(97.27 శాతం) సాధించారు. బాలికల విభాగంలో 7,573 విద్యార్థులు పరీక్ష రాయగా 7,455 విద్యార్థులు ఉత్తీర్ణత(98.44 శాతం) సాధించారు. టెన్త్ ఉత్తీర్ణతలో బాలురతో పోలిస్తే బాలికలే పైచేయిగా నిలిచారు.

సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

నిజాంపేట్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం చింతల్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయ చెక్కులను అర్హులైన లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే కె.పి. వివేకానంద మార్గదర్శకత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నిజాంపేట సర్కిల్ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, ఇతర నాయకులు పాల్గొని బుధవారం రాజీవ్ గృహ కల్ప, నిజాంపేటకు చెందిన పల్లుపోల శ్రావణికి రెండు లక్షల ముప్పై వేల రూపాయల ఆర్థిక సహాయ చెక్కును అందజే శారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజల అత్యవసర వైద్య అవసరాలు, కుటుంబ సమస్యలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సహాయం వారికి ఎంతో ఉపశమనం కలిగిస్తుందని తెలిపారు. అవసర సమయంలో అందే ఈ సహాయం అనేక కుటుంబాలకు తోడ్పడుతూ వారి జీవనోపాధిని స్థిరపరచడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. అలాగే లబ్ధిదారులు త్వరగా కోలుకొని మళ్లీ సాధారణ జీవన విధానంలోకి రావాలని ఆకాంక్షించారు. ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా ఇప్పటికే అనేక మంది లబ్ధి పొందుతున్నారని, అర్హులైన వారు ఈ పథకాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి స్థానిక నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు హాజరయ్యారు.

బాధిత ప్రజలే మొదటి లబ్ధిదారులు కావాలి

పీపుల్స్ కమిటీ ఫర్ మూసీ రివర్ రెజువెనేషన్ నేతల డిమాండ్

ధర్నాచౌక్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త: మూసీ పునరుజ్జీ వనంలో బాధిత ప్రజలే మొదటి లబ్ధి దారులు కావాలని పీపుల్స్ కమిటీ ఫర్ మూసీ రివర్ రెజువెనేషన్ నేతలు డిమాండ్ చేశారు. బుధవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో అడ్వకేట్ డాక్టర్ లుబ్నా సర్వత్, సయ్యద్ రఫీ, ప్రొఫెసర్ వెంకటదాస్‌ల ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ దీక్షా కార్యక్రమంనుద్దేసించి వారు మాట్లాడుతూ మూసీ నది చుట్టూ రాతి కట్టడాలు వద్దని, ప్రకృతి సహజంగా మూసీ ఉండాలని వారు విజ్ఞప్తి చేశారు. పునరుజ్జీవన ఉపసంఘం సభ్యులైన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు గతంలో విజ్ఞప్తి చేశామని, దీనిపై ఇప్పటి వరకు ఎటువంటి స్పందన లేదని ఆరోపించారు. ఇప్పటికైనా మూసీ నది నీరు మరియు పూడికపై సవివరమైన నివేదిక ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బౌరంపేట్ స్నేక్ పార్క్ ప్రాంతం పరిశీలన.. వాకింగ్ ట్రాక్‌కు హామీ

దుండిగల్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త

దుండిగల్ సర్కిల్ పరిధిలోని బౌరంపేట్‌లో ఉన్న స్నేక్ పా ర్క్ స్థలాన్ని జిల్లా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వేణుమాధవ రావు బుధవారం సాయంత్రం పరిశీలించారు. స్థానిక ప్రజలకు వాకింగ్ ట్రాక్ అవసరమని ఇటీవల బౌరంపేట్ బీఆర్ఎస్ నాయకులు ఫారెస్ట్ అధికారిని కలిసి వినతిపత్రం సమర్పిం చారు.ఈ మేరకు ఎమ్మెల్యే సిఫారసు లేఖను కూడా అందజేయగా, ఎమ్మెల్సీ ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో స్థలాన్ని స్వయంగా పరిశీలించిన ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వేణుమాధవ రావు, త్వరలోనే చర్యలు చేపట్టి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బౌరంపేట్ ప్యాక్స్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, సీనియర్ నాయకులు ఎస్.వి. సురేందర్ రెడ్డి, ధర్మారెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, ఫారెస్ట్ శాఖ అధికారి లక్ష్మణ్ పాల్గొన్నారు.

మూసాపేట ఉప కమిషనర్‌ను కలిసిన కాంగ్రెస్ శ్రేణులు

కెపిహెచ్‌బి కాలనీ, ఏప్రిల్ 29, ప్రభాతవార్త

కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ కార్యాలయములో మూసా పేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా నూతనంగా నియమి తులైన ఆంజనేయులును కూకట్‌పల్లి ఏ బ్లాక్ అధ్యక్షుడు, భరత్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి నాగిరెడ్డి బుధవారం కలిశారు. ఈ సందర్భంగా భరత్ నగర్ కాలనీ స్థానిక సమస్యలు అంతర్గత రోడ్లు, శానిటేషన్, దోమలు, పార్కులో ఉన్న ఓపెన్ జిమ్ మరమత్తుల గురించి కాలని వాసి జగదీష్‌తో కలసి ఉప కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. భరత్‌నగర్ కాలని 1978లో అనాటి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వము నాటి ముఖ్యమంత్రి డాక్టర్ చెన్నారెడ్డి చేతుల మీదుగా ప్రారం భించి అనేక మంది పేద మధ్య తరగతి ప్రజల సౌకర్య కోసం సుమారు 1900 వేల ఇల్లు అలాగే ప్రైవేటు హౌసెస్‌తోపాటు మహేశ్వరినగర్, శక్తినగర్ కాలనీ, జేపీనగర్, ఎస్పీనగర్‌వంటి అనుబంధబస్తీలు ఏర్పాటు అయ్యాయని చెప్పారు. స్థానికంగా ఇరుకు రోడ్లు వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని వీలైతే ఒక్క సారి పాద యాత్ర తద్వారా సమస్యలు అంతర్గత రోడ్లు శానిటేషన్ వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్ళి అధికారులతో సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు.

పేదల పెన్నిధి సిఎం సహాయ నిధి

దుండిగల్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త

పేదల పెన్నిధి సీఎం సహాయ నిధి పథకం అని, ఈ సహాయ నిధి పథకం నిరంతర సేవలతో వందలాది మం ది పేదలకు భరోసాగా నిలిచి ఆరోగ్యాలకు స్వస్థత చేకూ ర్చుకునేందుకు దోహదపడిందని కొర్ర శంకర్ నాయక్ అన్నారు. దుండిగల్ సర్కిల్ పరిధిలోని దుండిగల్ తాండ కు చెందిన కోర్ర రేఖ ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలిసిన మాజీ కౌన్సిలర్ కొర్ర శంకర్ నాయక్, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంబీపూర్ రాజుకు సమాచా రం అందించారు. ఈ విషయంపై వెంటనే స్పందించిన వారు ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించారు. మంజూరైన రూ.2 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసి పత్రాన్ని బుధవారం శంకర్ నాయక్ లబ్ధిదారురాలికి అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేదప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగకరమని, అవసరమైన వారు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేత్రపర్వంగా కామరతి బీరప్పల కళ్యాణమహోత్సం

ఉత్తరపల్లిలో శ్రీకామరతి, బీరప్పల కళ్యాణమహోత్సవం దృశ్యం

కంది, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:
మండలపరిధిలోని ఉత్తరపల్లిగ్రామంలో శ్రీబీరప్పస్వామి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీకామరతి బీరప్పస్వామి కళ్యాణమహోత్సవం, బలిచల్లుట కార్యక్రమాలు నేత్రపర్వంగా నిర్వహించారు. కురుమ యాదవ సంఘం అధ్యక్షులు యాదయ్య పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జాతరలో యువకులు, మహిళలు తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

నాబిశిల ప్రతిష్ఠ మహోత్సవ ఆహ్వాన పత్రిక అందజేత

హరీష్‌రావుకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న పలుగుగడ్డ గ్రామస్థులు

జగదేవ్‌పూర్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:
జగదేవ్‌పూర్ మండల పరిధిలోని పలుగుగడ్డ గ్రామంలో వచ్చే నెల 4వ తేదీన నాబిశిల ప్రతిష్ఠ, పెద్దమ్మతల్లి, పోచమ్మతల్లి ఆలయాల్లో విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం ఉన్నందున బుధవారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావును ముదిరాజ్ సంఘం సభ్యులు, గ్రామ నాయకులు కలిసి ఆహ్వాన పత్రిక అందజేసి కార్యక్రమానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం పెద్దలు నర్ర ఇస్తారి, లింగాల రామచంద్రం, బిఆర్ఎస్ నాయకులు గుండా రంగారెడ్డి, గ్రామ మాజీసర్పంచి శ్రీపతి రాజేశ్వరి రవి, ఉపసర్పంచి నర్ర కళ్యాణిరాజ్‌కుమార్, బిఆర్ఎస్ గ్రామశాఖ పార్టీ అధ్యక్షుడు పిట్టల అంజయ్య, ఉపాధ్యక్షుడు లింగాల కనకయ్య, గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పిట్టల ఎల్లేశ్, నాయకులు పెద్ద కనకయ్య, కరుణాకర్, నర్సింలు, కరుణాకర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి
-సర్పంచి రాజాగారి రేణుకరాజాగౌడ్

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచి రేణుకరాజాగౌడ్

రాయపోల్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:
రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే తమ ధాన్యాన్ని విక్రయించాలని వడ్డేపల్లి గ్రామ సర్పంచి రాజాగారి రేణుకరాజాగౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం రాయపోల్‌మండలం వడ్డేపల్లిగ్రామంలో ఐకెపిఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచి మరియాల స్వామి, వార్డుసభ్యులు, మార్కెట్‌కమిటీ డైరెక్టర్లు, వ్యవసాయ అధికారులు, ఐకెపిసిబ్బంది, వివిధపార్టీల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకత
-వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ బాగనోళ్ళ విజయమోహన్

ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని ప్రారంభిస్తున్న విజయమోహన్

ములుగు, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:
పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లను జరిపేందుకు ప్రభుత్వం పక్కా ప్రణాళికలు రూపొందించిందని, ఆరుగాలం రైతు శ్రమించి పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ బాగనోళ్ళ విజయమోహన్, పిఏసి ములుగు అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీరాజ్ సంఘటన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కడపల్ల నరసింహారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మండలకేంద్రమైన ములుగు, క్షీరసాగర్, కొట్యాల, తునికిబొల్లారం గ్రామాల్లో ధాన్యం కొనుగోలుకేంద్రాలను మండల వ్యవసాయాధికారిని ప్రగతి, సర్పంచ్ తీగుళ్ల కనకయ్య, మార్కెట్‌కమిటీ ఉపాధ్యక్షుడు కొడిత్యాల ప్రభాకర్‌గుప్త, జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షులు కొన్యాల బాల్‌రెడ్డి, యువజనకాంగ్రెస్ గజ్వేల్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు కడపల్ల కృష్ణారెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచులు లహరి శ్రీధర్‌రెడ్డి, ముత్యంరెడ్డి, వైల శేఖర్, ఏఈవో పృథ్వీ, పిఏసిఎస్ అధికారులు స్వరూప, అశోక్, వార్డుసభ్యులు నాగేష్, శ్రీకాంత్, మాధవి శ్రీనివాస్‌తోపాటు రైతులు తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో వైద్యారోగ్యశాఖ మంత్రి

వివాహవేడుకల్లో మంత్రి దామోదరరాజనర్సింహ, ఎంపి, ఎమ్మెల్యే

నారాయణఖేడ్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:
నారాయణఖేడ్ నియోజకవర్గం రేగోడ్ మండల పరిధిలోని టి.లింగంపల్లి గ్రామ ఆప్తులు రేగోడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దిగంబర్‌రావు పాటిల్ సోదరుడి కుమారుని వివాహ వేడుకలు హెచ్ఆర్ ప్యాలెస్ వేదికగా నిర్వహించగా, తెలంగాణరాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్‌కుమార్ షెట్కార్, నారాయణఖేడ్ శాసన సభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ నగేష్‌కుమార్ షెట్కార్‌లు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారితోపాటు మున్సిపల్ కౌన్సిలర్లు తదితర ముఖ్యనాయకులు ప్రజప్రతినిధులు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున వివాహ వేడుకల్లో పాల్గొన్నారు.

చిల్వర్‌లో చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ

సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న సిఐ రేణుకరెడ్డి

అల్లాదుర్గం, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:
మండల పరిధిలోని చిల్వర్ గ్రామంలో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం చైల్డ్ ప్రొటెక్షన్ కమిటిని సమావేశం, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కరుణాకర్, తహసీల్దారన మల్లయ్య, ఎంపిడిఓ వేద ప్రకాష్‌రెడ్డి, ఎస్ఐ శంకర్, అల్లాదుర్గం, గడిపెద్దాపూరం పిహెచ్‌సి డాక్టర్‌లు సారిక, అశ్విని, సీడీపీఓ నాగమణి, ఎంపిఒ గంగారం, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు కొప్పుల శేషారెడ్డి, ఉపాధ్యక్షులు సాయిబాబా, సర్పంచ్ శశిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి లింగప్ప, కాంగ్రెస్‌నాయకులు సుభాష్‌రావు, బహిరన్‌దిబ్బ, ఐడితండా, మాందాపూర్, గొల్లకుంటతాండ గ్రామాల సర్పంచ్‌లు వీరన్న, శంకర్‌నాయక్, రమ్యబూమ్‌రెడ్డి, మాన్యనాయక్, డిసిసి ప్రధాన కార్యదర్శి అంజగౌడ్, గ్రామపార్టీ అధ్యక్షులు రాజాగౌడ్, సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ జైపాల్, శేఖర్‌పటేల్, ఉపసర్పంచ్ లక్ష్మీనర్సింలు, తుకారం, మల్లయ్య బలరాజ్, రమేష్, అంగన్‌వాడి టీచర్‌లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళలను వేధింపులకు గురిచేస్తే ఉపేక్షించేదిలేదు
-గజ్వేల్ షీటీమ్ ఎస్ఐ శ్రీరాములు

అవగాహన కార్యక్రమంలో షీటీమ్ ఎస్ఐ శ్రీరాములు

గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:
మహిళలను ఎవరైనా వేధింపులకుగురిచేస్తే ఉపేక్షించేదిలేదని గజ్వేల్ షీటీమ్ ఎస్ఐ శ్రీరాములు అన్నారు. బుధవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ ఆదేశాల మేరకు గజ్వేల్ మాతాశిశుసంరక్షణ కేంద్రంలో గజ్వేల్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ ఆధ్వర్యంలో మహిళలు, పిల్లల రక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ మంజుల, సీనియర్ ఫార్మసీ ఆఫీసర్ విమల, హెడ్‌నర్సులు వకుళాదేవి, నిర్మల, ఇన్ఫెక్షన్ కంట్రోల్ నర్సింగ్ ఆఫీసర్ రజిత, నర్సింగ్ ఆఫీసర్లు మేరీ పుష్ప, జె. సరిత, ఆంజనేయులు, శోభ, సుమలత, కనకలక్ష్మి, వెంకటరమణ, హెల్త్ అసిస్టెంట్ దేవసాని వాసుదేవ్, తుమ్మ లత, స్రవంతి, అశోక్, ఇందిర, పోలీస్‌సిబ్బంది రామచంద్రారెడ్డి, మహేష్, శ్యామల, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు
-నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:
ఇళ్లు లేని ప్రతినిరుపేదకు పక్కా ఇల్లు కట్టించి ఇవ్వడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఇసుకపాయలతాండకు చెందిన రవీందర్‌నాయక్ దంపతులు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి ఎమ్మెల్యే సంజీవరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో సర్పంచి కవిత, నాయకులు రాయిని మధుసూదన్, నారాగౌడ్, దాచ సంగమేశ్వర్, సుభాష్, రాజేందర్‌గౌడ్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు పెరుమాళ్‌గౌడ్, ఆయా గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

గన్నిబ్యాగుల కొరత ట్రాన్స్‌పోర్టు సమస్య తలెత్తకుండా చూడాలి

బెజ్జంకి, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:
గన్నిబ్యాగుల కొరత ట్రాన్స్‌పోర్టు సరిగా లేక కొనుగోలు కేంద్రాలలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండల బిఆర్ఎస్ అధ్యక్షులు పాకాల మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గన్నిబ్యాగులు, ట్రాన్స్‌పోర్టు సౌకర్యం సరిగా లేకపోవడంతో కొనుగోలుచేసిన ధాన్యం కేంద్రాలలోనే నిలిచిపోతుందన్నారు. కొనుగోలుకేంద్రాలలో ధాన్యంనిల్వలు పెరిగిపోతుండడంతో రైతులు ఇబ్బందులుపడుతున్నారని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండ అధికారులు తగుచర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే బిఆర్ఎస్ పక్షాన పోరాటాలు చేస్తామన్నారు.

లబ్ధిదారులకు చెక్కులు పంపిణీచేసిన ఎమ్మెల్యే

బెజ్జంకి, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:
మండల కేంద్రంలోని ఎంపిడివో కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మండల వ్యాప్తంగా 60మంది కళ్యాణలక్ష్మీ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీచేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపిడివో ప్రవీణ్, ఎఎంసి చైర్మన్ పులి కృష్ణ, కాంగ్రెస్ నాయకులు ఒగ్గు దామోదర్, ఆయా గ్రామాల సర్పంచులు, లబ్ధిదారులు తదితరుల పాల్గొన్నారు.

సమగ్ర సర్వేపై ప్రత్యేకశ్రద్ధ చూపాలి: ఎమ్మెల్యే

కంటోన్మెంట్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త: మే 1 నుంచి ఎన్నికల కమీషన్ చేపట్టనున్న ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్.) కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు,నాయకులు అప్రమ త్తంగా ఉండాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ సూచిం చారు. బుధవారం తుకారాగేట్‌లోని ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమై పలు సూచనలు ఇచ్చారు. ఎస్.ఐ.ఆర్)పై ఉన్న కొన్ని అపోహలు ఉన్నందునా కార్యకర్తలు, బూత్ ఏజెంట్‌లు అప్రమత్తంగా ఉండాలన్నారు. అధికారులు తమ ఇండ్ల వద్దకు సర్వేకు వచ్చినప్పుడు సరైన సమాచారం ఇవ్వాలన్నా రు. నిజమైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్యామ్ సన్ రాజు, సదానంద్, బల్వంత్‌రెడ్డి, జమీల్, బాల్‌రాజు, సునీల్,హరిక్రిష్ణ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో 100 శాతం ఉత్తీర్ణత ఫలితాలు

కంటోన్మెంట్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:
సికింద్రాబాద్ మ హేంద్రహిల్స్‌లో సాం ఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో చదివిన 10వ తరగతి ఎస్ఎస్‌సీలో 10 శాతం ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ శీలం సునీత తెలిపారు. మహేం ద్రహిల్స్‌లోని గురుకుల పాఠశాలలో 79 మం ది పరీక్షలకు హాజరు కాగా 79 మంది ఉత్తీర్ణులైనట్లు ఆమె తెలిపా రు. 600కు 580 ఎం.ప్రవీనకు, జాహ్నవి 575, వి.నయోవి 569, కె.శ్వేత 551, సి.హెచ్.శిరీష 550 మార్కులు సాధించి టాపర్స్‌గా నిలిచా రు. 100 శాతం ఉత్తీర్ణత పొందిన విద్యార్థులకు, వారికి తోడ్పడిన ఉపాధ్యాయులను,కళాశాల ప్రిన్సిపాల్‌ను హైదాబాద్ జిల్లా కో ఆర్డినేటర్ సునీత అభినందించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:
నారాయణఖేడ్ మండలపరిధిలోని హనుమంతరావుపేట్, లింగాపూర్ గ్రామాల్లో బుధవారం జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, సెర్ప్, ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులు తాము పండించిన ప్రతి గింజను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతుధర పొందాలని కోరారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరల గ్రేడ్ ఎ-రకం వడ్లకు: క్వింటాలుకు రూ.2,389, సాధారణ రకం వడ్లకు: క్వింటాలుకు రూ.2,369, సన్న రకం వడ్లకు మద్దతుధరతో పాటు అదనంగా రూ.500 బోనస్ చెల్లించడం జరుగుతుందని ఆయన స్పష్టంచేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తూకం, రవాణా ప్రక్రియ వేగంగా జరిగేలాచూడాలని అధికారులను ఆదేశించారు. దళారులను ఆశ్రయించి తక్కువధరకు ధాన్యం అమ్ముకోవద్దని, తేమశాతం విషయంలో జాగ్రత్తలు వహించి మద్దతుధర పొందాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో మండల ఎంపిడిఓ శ్రీనివాస్‌రెడ్డి, నియోజకవర్గం వ్యవసాయ అధికారి నూతన్‌కుమార్, సంగన్న న్యాయవాది, రుక్మిణి హనుమండ్లు, సంజీవులు, సంజీవులు, భూమయ్య, సర్పంచులు సంగమేష్, పండరి, నారాయణ మాజీ ఎంపిటిసి, స్థానిక ప్రజాప్రతినిధులు, ఐకెపి అధికారులు, సెర్ప్ సిబ్బంది, గ్రామ రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

హనుమాన్ దీక్ష..భిక్షకు నెలవు సిద్దిపేట

హనుమాన్ మాలధారులతో భిక్ష చేస్తున్న హరీష్‌రావు

సిద్దిపేట, ఏప్రిల్ 29, ప్రభాతఎభార్త ప్రతినిధి:
హనుమాన్ దీక్ష..భిక్షకు నెలవు సిద్దిపేట అని హనుమాన్ మాలధారణ స్వాముల సిద్ధి సంకల్పం సఫలం కావాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. జిల్లాకేంద్రంలోని గణేష్‌నగర్ శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో హనుమాన్ స్వాములతో కలిసి భిక్షాకార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. హనుమాన్ స్మరణ నిత్యం వెల్లివిరియాలన్నారు. దేవాలయం స్వాములకు 21రోజుల పాటు భిక్షకు శాశ్వత విరాళంగా ప్రతి సంవత్సరం లక్ష రూపాయలను అందజేస్తున్నట్లు తెలిపారు. అలాగే సిద్దిపేట అర్బన్ మండలం బక్రిచెప్యాల గ్రామంలో శివపంచాయత నవగ్రహప్రతిష్ఠ కార్యక్రమంలో హరీష్‌రావు పాల్గొని పూజలు నిర్వహించారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అర్హులకు ఇళ్లు
-నియోజకవర్గ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి

ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న ఆవుల రాజిరెడ్డి

శివంపేట, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:
కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అర్హులైనవారికి ఇళ్లు అందజేయడం జరుగుతుందని కాంగ్రెస్ నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి అన్నారు. బుధవారం శివ్వంపేట మండలకేంద్రంలో బొట్టు లక్ష్మీనర్సింలు దంపతులు నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశానికి నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ అవుల రాజిరెడ్డి, మండల సీనియర్ నాయకులు పులిమామిడి నవీన్ గుప్తా, పిఎసిఎస్ మాజీ చైర్మన్ వెంకట్ రామిరెడ్డి, ఏఎంసీ మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు బుర్ర మురళిగౌడ్‌తో కలిసి గృహప్రవేశాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు లక్ష్మీకాంతరావు, కమల, రత్నపూర్ సర్పంచ్ ఆంజనేయులు, ఉపసర్పంచులు మంగళపర్తి స్వామి, బయన్నగారి శ్రీనివాస్, వార్డుసభ్యులు ఇసారపు రాజుగౌడ్, నాయకులు వరాల గణేష్, మాజీ కోఆప్షన్ సభ్యులు దావుద్, ప్రభులింగంగౌడ్, షేక్ అలీ, వజ్జ శ్రీనివాస్, మెతుకు మల్లేష్, ఇసుగారి అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను సెల్ ఫోన్లకు దూరంగా ఉంచాలి
-సిఐ జాన్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న సిఐ జాన్‌రెడ్డి తదితరులు

నర్సాపూర్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:
పిల్లలను మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచాలని నర్సాపూర్ సిఐ జాన్ రెడ్డి అన్నారు బుధవారం నర్సాపూర్ మండల పరిధిలోని ఆవంచ గ్రామంలో బాలల సంరక్షణ కమిటీపై గ్రామ సర్పంచ్ స్రవంతి కరుణాకర్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఐ జాన్ రెడ్డి హాజరై మాట్లాడారు 18 సంవత్సరాల లోపు వయసు ఉన్న బాల, బాలికల కోసం విలేజ్ లెవెల్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ పనిచేస్తుందని సూచించారు .ఈ కమిటీ సభ్యులందరూ పిల్లల అభివృద్ధి కోసం పనిచేయాలని తెలిపారు. ముఖ్యంగా పిల్లలకు జీవించే హక్కు ,చదువుకునే హక్కు ,అభివృద్ధి చెందే హక్కు గురించి క్లుప్తంగా వివరించారు. గ్రామంలో బాల్యవివాలను అరికట్టే విధంగా కమిటీ సభ్యులు కృషి చేయాలి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ముజం హుస్సేన్, ఎస్సై రంజిత్‌రెడ్డి, గ్రామసర్పంచ్ స్రవంతి కరుణాకర్, ఉపసర్పంచ్ కిష్టయ్య, ఐసిడిఎస్ సూపర్వైజర్ శివకుమారి పంచాయతీ సెక్రెటరీ మల్లేశం, అంగన్వాడీ టీచర్ రాణి, ఆశావర్కర్ వెంకటలక్ష్మి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చినహామీ నిలబెట్టుకున్న సర్పంచి

నర్సాపూర్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:
గ్రామపంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా గెలిపించినట్లయితే గ్రామంలోని ప్రతి ఆడపిల్ల పెళ్ళికి రూ.5000 వేలు నగదు పెళ్లికానుకగా అందిస్తానని గొల్లపల్లి సర్పంచ్ ఉసిరికపల్లి లక్ష్మీఆంజనేయులుగౌడ్ హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట తప్పకుండా బుధవారం నర్సాపూర్ మండలంలోని గొల్లపల్లి గ్రామంలో బొల్లు కవిత శ్రీనివాస్‌రెడ్డిల ప్రథమ కూతురు వివాహం సందర్భంగా గ్రామ సర్పంచ్ ఉసిరికపల్లి లక్ష్మీఆంజనేయులుగౌడ్ 5000 రూపాయలు గ్రామ ఉపసర్పంచ్ ఎర్రగొల్ల శేకర్‌యాదవ్‌తో కలిసి ఆడపిల్లకు పెళ్ళికానుకగా అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మి ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ ఎన్నికల హామీల మేరకు గ్రామంలోని ప్రతి ఆడపిల్ల వివాహకానుకగా 5000 రూపాయలు అందించామన్నారు. కార్యక్రమంలో వార్డ్‌సభ్యులు ఎండి. సంయుద్దీన్ గ్రామపెద్దలు పెద్ద నరసన్న, కోల నరసింహులు, ఆది శ్రీకాంత్, ఎర్రగొల్ల సురేష్ యాదవ్, పెళ్లికూతురు కుటుంబీకులు బొల్లు శేఖర్ రెడ్డి శశిధర్ రెడ్డి రాజురెడ్డి, సీనియర్ నాయకులు కృష్ణ గౌడ్ తదితరులు సమక్షంలో పెళ్లి కానుకను అందజేశారు.

ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించాలి
-వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ

వినతిపత్రం అందచేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

జోగిపేట, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:
ఉపాధి హామీ పథకంలో కూలీలకు రావాల్సిన 14వారాల బకాయిలను వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండలకమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఎంపిడివో కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. మండలకమిటీ ఆధ్వర్యంలో చందంపేటగ్రామంలో ఉపాధి పనులు జరుగుతున్న ప్రాంతాలను పరిశీలించి ఎంపిడివో కార్యాలయంలో వారు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎంపిడివో కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మేదరి శ్రీనివాస్, మేకల వీరమని, తలారి సంతోష, కొన్యాల రాములు, గొల్ల లక్ష్మి, కొన్యాల వెంకటేశం, పాపగారి పాండు, ప్రమీల, మేదరి లక్ష్మయ్య, మేకల క్రిష్ణమ్మ, గొల్ల రామన్న, మేకల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

పంటమార్పిడితోనే అధిక దిగుబడులు
-వ్యవసాయ శాస్త్రవేత్తలు

కార్యక్రమంలో రైతులకు సూచనలు చేస్తున్న శాస్త్రవేత్తలు

జోగిపేట, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:
రైతులు అధికదిగుబడులకోసం పంటమార్పిడిని తప్పనిసరిగా చేయాలని, అన్ని సీజన్లలలో ఒకే పంటను వేయటం మానుకోవాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు వి.హేమలత, ఏ. నిర్మల, డా.కిరన్‌రెడ్డి, చిరంజీవులు సూచించారు. రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలోభాగంగా బుధవారం మండలపరిధిలోని నేరెడిగుంట, పోతిరెడ్డిపల్లి గ్రామాల్లో నిర్వహించిన రైతుల సమావేశంలో పాల్గొన్న వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి శ్రీహరి, శ్రీనివాస్, ఉపసర్పంచి ఈశ్వరయ్య, అభ్యుదయ రైతులు తదితరులు పాల్గొన్నారు.

అవసరం మేరకే రసాయన ఎరువులు వాడాలి

రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

చౌటకూరు, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:
మండలపరిధిలోని తాడ్దానిపల్లిలో రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు-అన్నదాతల అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. రైతు విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కె.అరుణ రైతులకు పలుసూచనలు సలహాలు చేశారు. అవసరం మేరకు రసాయన ఎరువులను వినియోగించి ఖర్చు తక్కువచేసుకోవడంతోపాటు ప్రకృతిని రక్షించుకున్నవారవుతారన్నారు. పంట మార్పిడి పాటించి సుస్థితి ఆదాయాన్ని అందుకోవాలన్నారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలను సాగుచేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రంజిత, ఏఈఓ ప్రవీణ్, సర్పంచ్ పి.అంజమ్మ, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పించిన మండల వ్యవసాయ అధికారి

రైతులకు అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయ అధికారి రాజేష్

అల్లాదుర్గం, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:
మండల పరిధిలోని బహిరన్‌దిబ్బలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో బుధవారం గ్రామసర్పంచి పాంపాటి వీరన్న ఆధ్యక్షతన మండల వ్యవసాయ అధికారి రాజేష్ రైతులకు యూరియా బుకింగ్, రైతు గుర్తింపు కార్డుల నమోదుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారి రాజు, రైతులు పాల్గొన్నారు.

హత్నూర మండలంలో టాపర్లుగా అక్కాచెల్లెళ్లు

హత్నూర, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:
పదవతరగతిఫలితాలలో హత్నూరమండలంలో ఒక ఆశ్చర్యకరవిషయం వెలుగుచూసింది. హత్నూర గ్రామానికి చెందిన ఎండి వసీం అలీ ఇద్దరు కూతుర్లు ముస్కాన్ ఫాతిమా, మహిన్ ఫాతిమాలు ఇద్దరు మండలకేంద్రమైన హత్నూరలోని ప్రభుత్వ బాలికల ఉన్నతపాఠశాలలో పదవ తరగతి చదువుతూ పరీక్షలకు హాజరయ్యారు. బుధవారం ప్రకటించిన పదవ తరగతి పరీక్షాఫలితాల్లో అక్కచెల్లెళ్లు 567, 567 చొప్పున మార్కులు సాధించి, మండలంలో టాపర్లుగా నిలిచారు. అక్కచెల్లెళ్ళు ఒకే పాఠశాలలో చదువుతూ, ఒకేరకమైన మార్కులు సాధించి టాపర్లుగా నిలవడం మండలంలో ప్రశంసనీయ అంశంగా మారింది. టాపర్లుగా నిలిచిన వీరిని స్థానికులు, బంధువులు, మిత్రులు శాలువాలతో సన్మానించి, స్వీట్లు తినిపించి అభినందించారు.